ప్రజలే ప్రభువులు

# జనబలం

అక్టోబర్ 2024 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-





## ఒకే దేశం, ఒకే ఎన్నిక ప్రయాస ఎక్కువ, ఫలితం తక్కువ

## మహిళలకు భద్రత- మరింత స్వేచ్ఛ







## విజయవాడ వరదలు



## సీనియర్ సిటిజన్లకు 'ఆయుష్మాన్ భారత్'

# Gandhi jayanthi



## గాంధీ మంత్రం - భవిష్యత్తు సురక్షితం

''మీరు చేసే పని వల్ల సామాన్యులు తమ కాళ్ల మీద తాము నిలబడగలుగుతారా? వారికి తమ జీవితం మీద పట్టు వస్తుందా? అంటే, వారి సంపాదనా శక్తి పెరుగుతుందా? అలా పెరిగేట్లయితే అది నిజమైన స్వరాజ్యం.

వారి ఆత్మవిశ్వాసాన్ని, శక్తిని పెంచగలిగినట్లయితే అది నువ్వు చేయదగిన పని. లేకుంటే నిరర్థకమైన పని'' అని గాంధీజీ ప్రభుత్వాల్లో, ప్రజాజీవితంలో ఉన్నవారికి ఒక మంత్రం లాంటి ప్రమాణాన్ని నిర్దేశించారు

కానీ మనం ఏం చేస్తున్నాం?..

'ఎలాగోలా అధికారమే పరమావధి'మంత్రాన్ని జపిస్తూ 80% మందికి సంక్షేమం పేరుతో భారీ తాత్కాలిక పథకాలు,20% మందికి మాత్రమే అభివృద్ధి అవకాశాలు నమూనాను అనుకరిస్తున్నాం.ఇకనైనా మేలుకోవాలి

సమతూకంలో సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగాలిచ్చే సంస్థలకే ప్రోత్సాహకాలు, మౌలిక వసతులు, తక్కువ నైపుణ్యాలున్న గ్రామీణ కార్మికులకు వ్యవసాయేతర రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించటానికి గ్రామాల మధ్య ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా చిన్న పట్టణాల అభివృద్ధి, నాణ్యమైన ఆరోగ్యం, పాఠశాల విద్యా ప్రమాణాలను మెరుగుపరచటం ద్వారా మాత్రమే ప్రజలందరికీ తమ జీవితాలపై పట్టు లభిస్తుంది. అప్పుడు మాత్రమే గాంధీజీ ఆశించినట్లు నిజమైన స్వరాజ్యం, మన భవిష్యత్తు సురక్షితం



## అక్టోబర్ 2, గాంధీ జయంతి

**డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,** ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు




ప్రజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ పట్టణ సదస్సులో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

అక్టోబర్ 2024

సంపుటి 26 సంచిక 10


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.


05 ‘ఒకే దేశం, ఒకే ఎన్నిక’ ప్రయాస ఎక్కువ, ఫలితం తక్కువ

12 మహిళలకు భద్రత–మరింత స్వేచ్ఛ

15 విజయవాడ వరదలు –కొన్ని పరిష్కారాలు

22 యువతకు హేళిక స్ఫూర్తి

30 ప్రజావాణి – ప్రజావేదిక – అసలు సమస్య


### కార్టూన్ కార్నర్




కృత్రిమ ఆక్సిజన్ కూడా ఇమ్మంటున్నారు సార్!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యాయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# పార్టీల "బుల్డోజ్"రాజకీయాలు ఇంకెన్నాళ్లు?

సంపాదకీయం

ప్రపంచంలో అనేక ప్రజాస్వామ్య దేశాలలో ఏదో ఒకచోట ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికల ఫలితాలు వస్తున్నాయి. కొత్తగా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. ఈసారి ప్రపంచంలోని అగ్రరాజ్యమైన బ్రిటన్, ఫ్రాన్స్ మొదలుకొని మన పార్లమెంట్ వరకు సుమారు 10 దేశాలలో ఎన్నికలు జరిగాయి. అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్ష ఎన్నికలు వచ్చే నవంబర్ 5న జరగనున్నాయి. అందుకే ఇది ప్రపంచ ఎన్నికల నామ సంవత్సరంగా అభివర్ణిస్తున్నాము.

మనదేశంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాయి, జరగబోతున్నాయి. ఈ నెల మొదటి వారంలో జమ్మూ కాశ్మీర్, హర్యానాల్లో ఎన్నికలు జరిగాయి. వచ్చే జనవరిలోపు మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రజల తీర్పే శిరోధార్యమని అన్ని పార్టీలు పైకి ప్రకటిస్తున్నాయి. ఎన్నికలు పూర్తయిన వెంటనే ఎన్నికైన ప్రభుత్వాన్ని దించడం ఎలా అని కొన్ని పార్టీలు ఆలోచిస్తున్నాయి. నిన్న ఎన్నికైన ప్రభుత్వాన్ని రేపే అధికారం నుంచి దిగిపొమ్మని అంటున్నారు. ఎన్నికైన ప్రభుత్వాలు కనీసం 6 నెలల పాటు కూడా పరిపాలన చేయకుండానే మూడో రోజు నుండే ఇది "రాక్షస పాలన" "దుర్మార్గ పాలన" అని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. కాదు కాదు నిన్నటిదాకా మీరే అధికారంలో ఉన్నారు కనుక మీదే రాక్షస పాలన.. మీదే దుర్మార్గ పాలన అంటూ మొన్నటిదాకా అధికారంలో ఉన్న పార్టీల నాయకులను కొత్తగా అధికారంలోకి వచ్చిన వారు విమర్శిస్తున్నారు.

ప్రజాస్వామ్య విలువలు లేవంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరసన కార్యక్రమాలు చేసిన రాజకీయ పక్షాలు అధికారంలోకి రాగానే వాటి ప్రవర్తన తీరు అనూహ్యంగా మారిపోతుంది. అలాగే నిన్నటి దాకా అధికారం చలాయించిన రాజకీయ పార్టీలు ఓడిపోగానే ప్రజా తీర్పును శిరసావహిస్తామని చెప్పడం కాకుండా ఈవీఎంలలో అవకతవకలనో లేక మరో కారణమో చెబుతూ ఎన్నికలలో లోపాలను వెతుకుతున్నాయి. ఒకరకంగా ప్రజా తీర్పును అవమానిస్తున్నాయి.

ఇక ప్రభుత్వ అధికారుల పని తీరు చూస్తుంటే రాజకీయ నాయకుల కంటే అధ్వానంగా ఉంది. ప్రభుత్వంలోని పెద్దలు, అధికార పార్టీ నాయకులతో అంటకాగుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వాలు మారగానే జైలుకెళ్ళిన సందర్భం కూడా చూశాం. గత 15 ఏళ్లుగా ఇది మరింత పేట్రేగి పోయింది.

ఈ విషయం గురించి ఇటీవల వివిధ రాష్ట్రాల హైకోర్టులతోపాటు సుప్రీంకోర్టు సైతం ప్రభుత్వ అధికారుల పనితీరుపై అనేక విమర్శలు చేశాయి. "స్వామి కంటే స్వామి భక్తి, రాజు కంటే రాజభక్తి చూపించొద్దని" అధికారులకు హితవు చెప్పాయి. కోర్టు ఎన్ని మొట్టికాయలు వేసినా కూడా పట్టించుకోకుండా కొంతమంది అధికారులు నిస్సిగ్గుగా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.

ఇది మారాలంటే ప్రభుత్వాలను ప్రభుత్వాలుగా గౌరవించుకోవడం నేర్చుకోవాలి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అని పిలిచేవారు. తర్వాత పార్టీల పేరుతో.. కాంగ్రెస్, తెలుగుదేశం, టిఆర్ఎస్, వైసీపీ ప్రభుత్వాలనే వారు.. ఇప్పుడా పిలుపు మారింది. వ్యక్తుల పేర్లతో పిలిచే సంస్కృతి వచ్చింది. వ్యక్తుల పేర్లతో ప్రభుత్వాలు చలామణి అవుతున్నాయి.

అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు గత ప్రభుత్వాలను విమర్శిస్తూ కాలం గడుపుతున్నాయి. కానీ తాము ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించి ముందుకు వెళదామనే ఆలోచన లేకుండా ఉంటున్నాయి. గతంలోని విధ్వంస పాలనకు వ్యతిరేకంగా మరింత విధ్వంసాన్ని సృష్టిస్తున్నారే తప్ప నిర్మాణాత్మక ఆలోచనలతో ముందుకు పోవడం లేదు. ఇది విచారకరం. గెలిచినవారు ఇక వచ్చే పదేళ్లు మాదే అధికారం అంటూ విర్ర వీగుతుంటే ఓడిన వారు రేపే ఈ ప్రభుత్వాన్ని దించి అధికారంలోకి వస్తామని బీరాలు పలుకుతున్నారు. ఐదేళ్ల కాలానికి ఎన్నికైన ప్రభుత్వాలను వారి పరిపాలనను తమ పాలనతో బేరీజు వేస్తూ వారి విధానాలు కానీ పాలనాపరమైన తప్పిదాలను కానీ ప్రతిపక్షాలు ఎండగట్ట వలసిందే. కానీ దానికి కూడా కొంత పద్ధతి ఉంటుంది. "బట్ట కాల్చి మీద వేసి" ప్రభుత్వాలను బదనాం చేసే క్రమంలో ఒకవైపు ప్రతిపక్షాలు, మరోవైపు ప్రతిపక్షాలను "బుల్డోజ్" చేస్తూ తాము తగ్గేదేలే అంటూ అధికార పక్షాలు వ్యవహరిస్తున్నాయి. వచ్చే ఎన్నికలలో ప్రజలకు జవాబుదారీ కావలసిన అవసరం ఉందని మర్చిపోతున్నారు. అందుకే ప్రజలు కూడా తమకు అవకాశం వచ్చేదాకా ఆగి అంతకుముందున్న ప్రభుత్వాలను గద్దె దించుతున్నారు. కొత్త ప్రభుత్వాలను గద్దెనెక్కిస్తున్నారు. కానీ ప్రజలు తమను ఎందుకు ఎన్నుకున్నారన్న విషయం మరిచిపోయి కొత్తగా అధికారంలోకి వచ్చిన వారు మళ్లీ మళ్లీ అవే తప్పులు చేస్తున్నారు. ఈ రంగులరాట్నం రాజకీయాలు ఆగాలంటే ప్రజలు **ఆటగాళ్లను మార్చడం కాదు ఆట నియమాలను మార్చాలనే** డిమాండ్ ముందుకు తీసుకురావాలి. లేకపోతే ఈ రాజకీయ వికృత క్రీడ సాగుతూనే ఉంటుంది.

–బండారు రామ్మోహనరావు

# 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' ప్రయాస ఎక్కువ, ఫలితం తక్కువ

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**



దేశంలో ఇక్కడో, అక్కడో తరచూ ఎన్నికలు, నిరంతర ప్రచారం మన పౌరులు, మీడియా విశ్లేషకులు, మధ్యతరగతి వర్గాలకు విసుగు తెప్పిస్తోంది. పార్టీల మధ్య ఎడతెగని ఆరోపణలు, ప్రత్యారోపణలు మధ్య మనలో అనేకులు కొట్టుకుపోతున్నారు. దీంతో, లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు అయిదేళ్లకోమారు ఒకేసారి ఎన్నికలు, జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికల తర్వాత పంచాయతీలు, మునిసిపాలిటీలన్నిటికీ 100 రోజుల్లోగా ఎన్నికలు అనగానే, చాలా ఆకర్షణీయంగా అనిపిస్తుంది. కానీ సంస్కరణ కోసం సంస్కరణ మన ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచదు; అది మన సవాళ్లను మరింత సంక్లిష్టం చేయవచ్చు కూడా.


మూడంచెల్లోని అన్ని ఎన్నికలనూ సమన్వయం చేసి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఒకేసారి ఎన్నికలను నిర్వహించటానికి మనకు పలు రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయి. అటువంటి ప్రతిపాదన కోసం లోక్‌సభ, రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించటం దాదాపు అసాధ్యం.

ఏకాభిప్రాయానికి రావటానికి రాజకీయ కష్టనష్టాల్ని అలా ఉంచితే, నిజంగా దాని వల్ల ప్రయోజనముంటుందా? అటువంటి రాజ్యాంగ సవరణ వల్ల వాస్తవ ప్రయోజనాలు చాలా తక్కువే ఉన్నట్లు కనిపిస్తాయి. జమిలి ఎన్నికలు డబ్బు ఆదా చేస్తాయని అనుకూలురు వాదిస్తారు. నిజమే, లోక్‌సభ, అసెంబ్లీకి ఎన్నికలు వేర్వేరుగా జరపకుంటే కొంత ప్రజాధనం ఆదా అవుతుంది. కానీ ఆ లాభం చాలా పరిమితం మాత్రమే. లోక్‌సభ ఎన్నికలకు ఖజానా ఖర్చు 2019లో రూ.6500 కోట్లు, 2024లో రూ.10,000 కోట్లుగా అంచనా. రాష్ట్ర అసెంబ్లీలన్నిటికీ ఎన్నికలు వేరుగా జరిపితే, అయిదేళ్ల ఎన్నికల్లో మరో రూ.10,000 కోట్లు ఖర్చు ఉండవచ్చు. అంటే, ఏడాదికి రూ.2,000 కోట్లు. ఒకేసారి ఎన్నికలకు కేవలం లోక్‌సభ ఎన్నికలకయ్యే ఖర్చు కన్నా బహుశా 25% అదనంగా ఖర్చవ్వచ్చు. కాబట్టి జమిలి వల్ల అయిదేళ్లలో రూ.7,500 కోట్లు, అంటే, ఏడాదికి రూ.1500 కోట్లు ఆదా అవుతాయి. ఖర్చును ఏమాత్రం తగ్గించగలిగినా స్వాగతించాల్సిన విషయమే. కానీ అదే సమయంలో మనం గమనించాల్సింది, భారత్‌లో అన్ని ప్రభుత్వాలూ కలిపి చేస్తున్న సరాసరి వ్యయం రోజుకి రూ.20,000 కోట్లు! ఈ నేపథ్యంలో, ఒకేసారి ఎన్నికల వల్ల దేశానికి ఆదా అయ్యే డబ్బు చాలా స్వల్పం.

ఇంకో వాదన, వేర్వేరు ఎన్నికల వల్ల రాజకీయం దృష్టి, పాలనా యంత్రాంగం సమయం, శక్తిసామర్థ్యాలు తరచూ ఎన్నికల నిర్వహణ మీద వెచ్చించాల్సి వస్తోంది, దీనివల్ల పరిపాలన మూల్యం చెల్లిస్తోంది. ఈ రాష్ట్రంలోనో, ఆ రాష్ట్రంలోనో తరచూ ఎన్నికల వల్ల మౌలిక వసతులు, అభివృద్ధి, పౌర సేవలు పణంగా తాత్కాలిక జనాకర్షణ, ఆచరణసాధ్యంకాని వ్యక్తిగత సంక్షేమ పథకాలు పెచ్చరిల్లుతున్నాయి. సమ్మిళిత అభివృద్ధి, పేదరిక నిర్మూలన, అందరికీ అవకాశాల్ని పెంచటానికి ఆర్థిక క్రమశిక్షణ, తెలివిగా వనరుల నిర్వహణ కీలకం. కానీ రాష్ట్ర, జాతీయ ఎన్నికలను కలపటం వల్ల తాత్కాలిక, ఆచరణసాధ్యంకాని సంక్షేమం జాతీయ స్థాయిలో కూడా మితిమీరి మొత్తం ఆర్థిక వ్యవస్థను కుంగదీసే ప్రమాదముంది. ఇప్పుడు కనీసం ఓటర్లకు రాష్ట్ర స్థాయిలో విధానాలను సమీక్షించుకుని తమ అసంతృప్తిని తర్వాత సమీప కాలంలో జరిగే ఎన్నికల్లో వ్యక్తం చేసే అవకాశముంది. కర్ణాటకనే తీసుకోండి, 2023లో వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ గ్యారంటీల కోసం పెద్దఎత్తున ఓటు వేశారు. ఏడాది తిరిగేలోగా, రాష్ట్రంలో అనేక లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్ ఓడిపోయింది. ఆర్థిక నిర్వహణకు మరింత సమతూకం ధోరణి అవసరమన్న ఆకాంక్షను ఓటర్లు వ్యక్తం చేశారు. అదేవిధంగా, తెలంగాణ. తాత్కాలిక వ్యక్తిగత

గ్యారంటీల వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినా, కొన్ని నెలల్లోనే సగం లోక్‌సభ స్థానాల్లో మద్దతును పొందలేకపోయింది. అదేవిధమైన ఎన్నికల సంకేతాలను అంతకుముందు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఓటర్లు ఇచ్చారు. వాస్తవానికి, ఒక అస్థిర రాజకీయ వాతావరణంలో వేర్వేరుగా ఎన్నికలు పంథా మార్చుకోండని రాజకీయ వ్యవస్థకు సంకేతాలు పంపటానికి ఓటర్లకు ఓ అవకాశాన్నిస్తాయి.

మధ్యంతర ఎన్నికల్లో గెలిచిన రాష్ట్ర అసెంబ్లీ కాలపరిమితిని కుదించాలని కోవింద్ కమిటీ సిఫార్సు చేసింది. వచ్చే ఎన్నికను లోక్‌సభతో కలిసి ఒకేసారి జరిపేందుకు వీలుగా ఈ సిఫార్సు చేసింది. అసెంబ్లీ పదవీ కాలాన్ని లోక్‌సభ కాలపరిమితిపై ఆధారపడేట్లు చేయటమే కాకుండా, స్థిరమైన, ఎన్నికైన రాష్ట్ర అసెంబ్లీని కుదించటం అవాంఛనీయ, అనుకోని పర్యవసానాలకి దారితీస్తుంది. ఆచరణసాధ్యంకాని వ్యక్తిగత సంక్షేమానికి, మౌలిక వసతుల నిర్మాణం, పెట్టుబడుల ప్రోత్సాహం, విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యాన్ని మెరుగుపరచటం, చట్టబద్ధపాలన బలోపేతం కోసం ప్రభుత్వం చేయాల్సిన దీర్ఘకాల ఆర్థికాభివృద్ధి, ప్రజాహితం కోసం సమతూకం సాధించటం ఒక వైవిధ్యభరిత ప్రజాస్వామ్యంలో, అందులోనూ అపార పేదరికం, అవిద్య ఉన్న మనలాంటి దేశంలో, అతి పెద్దసవాలు. అసెంబ్లీ కాలవ్యవధిని కుదిస్తే, దీర్ఘకాలిక ఆలోచనా విధానాన్ని పెంపొందించటం మరింత కష్టమవుతుంది. పార్టీలు, ప్రభుత్వాల ధ్యాసంతా భవిష్యత్తును పణంగా పెట్టి తక్షణ సంతృప్తి పథకాల్ని గరిష్ట స్థాయికి తీసుకెళ్లి ఓటర్లను ఆకట్టుకోవటంపైనే ఉంటుంది.



అమెరికాలో ఓటర్లు ఒకే బ్యాలెట్ పత్రంపై 25–30 మంది ప్రభుత్వ నాయకత్వాన్ని ఎన్నుకుంటారు – అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సెనెటర్, కాంగ్రెస్ ప్రతినిధి, రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర శాసనసభ సభ్యుడు, మేయర్, స్థానిక కౌన్సిల్, స్థానిక ప్రాసిక్యూటర్, స్కూల్ బోర్డు మొదలైనవారు. పార్టీ భక్తులైన ఓటర్లు కూడా బ్యాలెట్ పై నుంచి కింది వరకు ఒకే పార్టీకి చెందిన అభ్యర్థులకి ఓటు వేయరు. అధికార బాధ్యతల కో సం అత్యధిక అభ్యర్థులను వ్యక్తిగత ప్రతిభాపాటవాల ఆధా రంగా ఎంపిక చేస్తారు. ఓటర్లు వివేకవంతమైన తీర్పు నిస్తా రు.

భారత్‌లో 85–90% మంది ఓటర్లు అభ్యర్థుల అర్హతలతో ప్రమేయం లేకుండా అన్ని స్థాయిల్లో – జాతీయ, రాష్ట్ర, స్థానిక – ఒకే పార్టీకి ఓటు వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఓటర్ల అభిప్రాయమే తరచుగా వారి ఓటును ప్రభావితం చేస్తోంది; వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమోదిస్తే, మూడంచెల్లోనూ ఆ పార్టీకి ఆ ఓట్లన్నీ వస్తాయి; రాష్ట్ర ప్రభుత్వం పట్ల వారు అసంతృప్తితో ఉంటే, అన్ని స్థాయిల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసే అవకాశముంది.

చాలామంది ఓటర్లకు వేర్వేరు అంచెల్లోని ప్రభుత్వ బాధ్యతలపై అవగాహన తక్కువగా ఉంటుంది; తాగునీటి కోసం ఎం.పి దగ్గరకు వెళ్తారు, వీధి దీపాల కోసం ఎం.ఎల్.ఏ దగ్గరకు వెళ్తారు! ఎన్నికయిన ప్రభుత్వాల పాత్రపై ఓటర్లకు స్పష్టత లేనప్పుడు, ఎన్నికలు అసంతృప్తిని వ్యక్తం చేయటానికి మొక్కుబడి వాహనాలవుతాయి. ఏ సమస్యకు ఏ స్థాయిలో పరిష్కారం వస్తుందో ఆ ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయటానికి ఓటు ఎంతమాత్రమూ ఒక నాగరిక సాధనం కాబోదు. మన ఓటర్ల మనసుల్లో మరింత గందరగోళం అక్కర్లేదు. మనకు మరింత ఎక్కువ స్పష్టత, వివేచన అవసరం. కనీసం విడివిడిగా ఎన్నికలు జరిగితే, ఏ స్థాయి ప్రభుత్వం ఏ బాధ్యతలని నిర్వహించాలో క్రమ క్రమంగా ఓటర్లకి తెలిసి ప్రజాస్వామ్యం పరిణతి చెందుతుంది. అలాకాక ఓటుని కేవలం ఆగ్రహంతోనో, భ్రమల తోనో వేస్తూ పోతుంటే మన వ్యవస్థ మరింత గందరగోళానికి దారితీస్తుంది.

ఎన్నికల్లో చట్టవిరుద్ధ డబ్బు, ఓటర్లకు ప్రలోభాలను తగ్గించి స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో సాధికారత, దానివల్ల ఆమె ఓటుకి, ఆమె జీవితాన్ని ప్రభావితం చేసే పరిణామాలకు మధ్య సంబంధాన్ని ఓటరు మనసులో పాదుకొల్పటానికి, చెల్లించే పన్నులకు, అందుకునే సేవలకు మధ్య సంబంధాన్ని అర్థమయ్యేలా చేయటానికి, ఎవరు దేనికి బాధ్యులో ఓటరుకు స్పష్టంగా తెలియచెప్పటానికి, సివిల్, క్రిమినల్ అన్ని అంశాల్లో వేగంగా, ప్రభావశీలంగా నిష్పాక్షికంగా వేగంగా న్యాయాన్ని అందించటానికి, చట్టబద్ధపాలనను మెరుగుపరచటానికి మనకు ఎంతో ముందుచూపున్న సంస్కరణలు అవసరం.

జమిలి ఎన్నికలు సర్వరోగ నివారిణి, సిల్వర్ బుల్లెట్ కాదు. మన ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లను నింపాదిగా, నిష్పక్షపాతంగా, లోతుగా పరిశీలించటానికి, అవసరమైన సంస్కరణలపై ఏకాభిప్రాయ సాధనకు ఇదో అవకాశం. ★

# అసాధ్యం, అధికార పార్టీకీ నష్టం

- అర్జున్

ఎన్నికలు ప్రజాస్వామ్యంలో కీలకమైన వ్యవస్థ. పౌరులకు తమ ప్రతినిధులను ఎన్నుకొనే హక్కు ఇస్తాయి. వివిధ స్థాయిల ప్రభుత్వాలు వేర్వేరు బాధ్యతలను నిర్వహిస్తాయి కాబట్టి, పౌరులు తమ ఓటు వేయబోయే ఎన్నికకు అనుగుణంగా అక్కడి ప్రభుత్వ బాధ్యతలను పరిగణలోకి తీసుకోవాలి.

పార్లమెంటు ఎన్నికలు జాతీయ స్థాయిలో నిర్వహిస్తాయి. ఆ స్థాయిలో దేశ ఆర్థిక, ద్రవ్య, విదేశాంగ విధానాల వంటి విస్తృతమైన అంశాలకు ప్రాముఖ్యత ఉంటుంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి రాష్ట్ర స్థాయి అంశాలపై దృష్టి పెడతాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్కడి పౌరుల నిత్యజీవితానికి సంబంధించిన సేవల నాణ్యతను, అందులో పరిశుభ్రత, నీరు, రోడ్లు, బహిరంగ మరుగుదొడ్లు వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చి ఓటు వేయాలి.

ఇటీవల కేంద్ర మంత్రివర్గం "వన్ నేషన్, వన్ ఎలక్షన్" (ఒకే దేశం, ఒకే ఎన్నిక) విధానానికి ఆమోదం తెలిపింది. ఈ విధానం ఎన్నికల ఖర్చులను, తరచుగా జరిగే ఎన్నికల వల్ల పాలనకు కలిగే అంతరాయాలను తగ్గిస్తుంది అని మాజీ రాష్ట్రపతి రాం నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం చెబుతోంది. ఈ వాదనలు తార్కికంగా కనిపించిన ప్పటికీ, ఒకేసారి ఎన్నికల సాధ్యత అనిశ్చితంగా ఉంది. ముఖ్యం గా, మన దేశంలో ఇది ప్రజాస్వామ్య అభివృద్ధికి హితకరం కాదు. అధికారంలో ఉన్న పార్టీకి కూడా లాభదాయక మయ్యే అవకాశంగా లేదు.

**ఎందుకు సాధ్యం కాదు?**

భారతదేశం 1967 వరకు "వన్ నేషన్, వన్ ఎలక్షన్" నమూనాను అనుసరించింది. కానీ రాష్ట్ర శాసనసభలు, పార్లమెంటు తరచుగా రద్దు కావడంతో ఈ పద్ధతిలో అంతరాయం ఏర్ప డింది. దీన్ని ఎదుర్కొనేందుకు, కోవింద్ నేతృత్వంలోని కమిటీ దశలవారీగా ఒక ప్రణాళికను ప్రతిపాదించింది. మొదటి దశలో, పార్లమెంట్, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిం చాలని ప్రతిపాదించింది. తదనంతరం, రాష్ట్ర శాసనసభల రద్దు తేదీలను పార్లమెంటు రద్దు తేదీలతో కలపాలని సూచించింది. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం రద్దయినప్పుడు, తిరిగి ఎన్నికలు జరు గుతాయి. కానీ కొత్త ప్రభుత్వం 5 సంవత్సరాల్లో మిగిలిన పదవీ కాలం మాత్రమే అధికారంలో ఉంటుంది.

ఈ పద్ధతికి అనేక సవాళ్ళున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు తమ అధికారాన్ని జాతీయస్థాయి ప్రభుత్వం, దాని చట్టాల నుంచి కాకుండా, రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా, తమ ప్రాంత ప్రజల సర్వసమ్మతి ద్వారా పొందుతాయి. రాష్ట్రానికి అవసరమైనప్పుడు ఓటర్ల నుంచి కొత్త అనుమతి కోరడానికి ఎన్నికలు నిర్వహించే స్వేచ్ఛ ప్రజాస్వామ్య నిర్మాణానికి కీలకం. ఒకేసారి ఎన్నికల కోసం ప్రతిపాదిత చట్టం ఈ స్వాతంత్ర్యాన్ని తగ్గిస్తుంది, అవసరమైనప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలు నిర్వహించే సౌలభ్యాన్ని పరిమితం చేస్తుంది.

**ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ఎందుకు ఆమోదయోగ్యం కాదు?**

"ఒకే దేశం – ఒకే ఎన్నిక" పద్ధతి యూనియన్, రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పాత్రలపై ప్రజలను గందరగోళంలోకి నెట్టే ప్రమాదం ఉంది. జాతీయ, ప్రాంతీయ పాలనల మధ్య వ్యత్యాసాలను మరింత అస్పష్టం చేస్తుంది. రాజ్యాంగంలో ఉన్న సమాఖ్య సూత్రాలను బలహీనపరిచే అవకాశముంది. పాలనను మెరుగుపరచడం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి సమర్థవంతమైన విధానం స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయడం, విధులు, సిబ్బంది నిధులను నేరుగా అప్పగించడం.

స్థానిక ప్రభుత్వాలను "ప్రజాస్వామ్య పాఠశాల'గా పిలుస్తారు. ఎందుకంటే ఓటర్లు తాము వేసే ఓటు, వారు అందుకునే సేవలకి మధ్య నేరుగా ఉన్న సంబంధాన్ని స్పష్టంగా చూడగలరు. ఈ స్థానిక సంస్థలను బలోపేతం చేయడం ప్రజాస్వామ్య పాలనను మాత్రమే పెంచదు, సేవల నాణ్యతను కూడా మెరుగు పరుస్తుంది. ప్రజల అవసరాలకు పాలనని దగ్గరగా చేస్తుంది. స్థానిక స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా, మొత్తం వ్యవస్థ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత ప్రతిస్పందిస్తుంది, స్థిరత్వం కలిగి ఉంటుంది.

**అధికార పార్టీకీ ఎందుకు లాభం కాదు?**

"వన్ నేషన్, వన్ ఎలక్షన్"ను అమలు చేయడానికి, జాతీయ ప్రభుత్వం పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీతో కూడిన రాజ్యాంగ సవరణను ఆమోదించాలి, రాష్ట్ర శాసనసభలలో కనీసం సగం ధృవీకరించాలి. ప్రస్తుత ప్రభుత్వానికి ఈ సవరణ ను ముందుకు తీసుకువెళ్లడానికి అవసరమైన మెజారిటీ లేదు. పరిమిత ప్రయోజనాలు కలిగిన సాధనంపై రాజకీయ శక్తిని వినియోగిం చడానికి బదులుగా, దేశం ఎదుర్కొంటున్న ముఖ్యమైన అవ సరాలపై దృష్టి పెట్టడం మంచిది. ముఖ్యంగా ఎన్నికల్లో డబ్బు, మందబలం వినియోగం తగ్గించడం, విద్య, ఆరోగ్య రంగాల్ని మెరుగుపరచడం –దీర్ఘకాల అభివృద్ధికి కీలకమైన అంశాలు.

ఈ సవరణను అమలు చేయలేకపోవడం వల్ల అధికారంలో ఉన్న పార్టీ విశ్వసనీయతను కోల్పోవడమే కాకుండా, ఇది భారత దేశానికున్న ఓ గొప్ప అవకాశాన్ని కోల్పోవడమవుతుంది. మూడో సారి అధికారంలోకి రావడం ద్వారా సాధించిన రాజకీయ పెట్టు బడిని సద్వినియోగం చేసుకోవడంలో బీజేపీ విఫలమవుతుంది. దీర్ఘకాలిక పాలన లక్ష్యాలు, వ్యక్తిగత తాత్కాలిక ఉచితాల మధ్య జరుగుతున్న పోరాటం మరింత విస్తరించవచ్చు. ఎందుకంటే పోటాపోటీ ఎన్నికల రాజకీయంలో ప్రతిపక్ష పార్టీలు తాత్కాలిక వాగ్దానాలను ఉపయోగించి ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తాయి. ★

# ఏకకాల ఎన్నికలు - నేపథ్యం, వివరాలు

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరపటం భారతదేశానికి స్వతంత్రం వచ్చాక సుమారు రెండున్నర దశాబ్దాలపాటు కొనసాగింది. 1951 నుండి 1967 వరకు దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలటంతో మధ్యంతర ఎన్నికలొచ్చాయి. దీంతో దేశవ్యాప్త ఎన్నికలకు, ఆయా రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల గడువులు మారాయి. ప్రస్తుతం యూనియన్ ప్రభుత్వం జమిలి ఎన్నికలకు ఆమోదం తెలిపింది కాబట్టి, ఆయా రాష్ట్రాల ఎన్నికలన్నిటినీ పార్లమెంటు ఎన్నికలతో కలిపేందుకు వీలుగా కొన్ని రాష్ట్రాల ఎన్నికల గడువును పెంచటమో, కొన్నిటిని తగ్గించటం చేయాలి. భవిష్యత్తులో మళ్లీ ఎన్నికల తేదీలు మారకుండా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు పడిపోయినా తగిన చర్యలకు సంస్థాగత ఏర్పాట్లు చేయాలి. ఇందుకోసం 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించటంతోపాటు కొన్ని రాజ్యాంగ సవరణలు చేయాలని నిపుణులు చెబుతున్నారు. ఇవి లోక్‌సభ, రాజ్యసభల కాలపరిమితి, రాష్ట్రాల అసెంబ్లీకు అయిదేళ్ల గడువు నిర్దేశం, అత్యయిక పరిస్థితుల సమయంలో పార్లమెంటు, అసెంబ్లీ కాలపరిమితిని ఏడాదికి మించకుండా సభల రద్దుకు ఏర్పాటు, రాష్ట్రపతి, గవర్నర్‌లకు అధికారాలు, రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలనకు వీలు కల్పించటం, ఎన్నికల కమిషన్ అధికారాలకు సంబంధించిన అధికరణాలు.

## కోవింద్ కమిటీ నివేదిక సిఫార్సులు



దేశంలో జమిలి ఎన్నికలకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సులకు కేంద్రం ఆమోద ముద్ర వేయటంతో ఈ దిశగా ముందడుగు పడినట్లయింది. గతంలో జమిలిపై నివేదికను రాష్ట్రపతికి అందచేయటంతో సెప్టెంబర్‌లో వాటిని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. **ఈ నేపథ్యంలో నివేదికలోని 10 ముఖ్యాంశాలు:**

☞ జమిలి ఎన్నికల కోసం ఒక ప్రత్యేక న్యాయ రక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి

☞ తొలిదశలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాలి

☞ రెండో దశలో మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరపాలి. ఇవి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 100 రోజుల లోపు పూర్తి కావాలి.

☞ ఏకకాల ఎన్నికల కోసం లోక్‌సభ తొలిసారిగా సమావేశమైన తేదీని అపాయింటెడ్ డే గా రాష్ట్రపతి గుర్తించాలి

☞ అపాయింటెడ్ డే ఆధారంగా అసెంబ్లీల పదవీ కాలాన్ని గుర్తించాలి

☞ హంగ్ సభలు ఏర్పాటైనప్పుడుగానీ, అవిశ్వాస తీర్మానాలప్పుడుగానీ లోక్‌సభకు తాజా ఎన్నికలను నిర్వహించాలి

☞ లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే ఐదేళ్లలో మిగిలిపోయిన కాలానికే ఆ సభ కొనసాగేలా చూడాలి

☞ అసెంబ్లీలు రద్దయినా లోక్‌సభ పదవీకాలంతోపాటు మిగిలిన కాలానికే అవి కొనసాగాలి

☞ రాష్ట్ర ఎన్నికల సంఘాలతో కలిసి ఒకే ఫొటో గుర్తింపు కార్డును కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేయాలి

☞ ఎన్నికల సామాగ్రి, ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, పోలింగ్ సిబ్బందిని సమకూర్చుకోవటంపై ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి

## ఏడు దేశాల్లో అధ్యయనం

జమిలి ఎన్నికలపై నివేదిక సమర్పించిన కోవింద్ కమిటీ 7 దేశాల్లో అధ్యయనం చేసింది. అందులో దక్షిణాఫ్రికా, స్వీడన్, బెల్జియం, జర్మనీ, జపాన్, ఇండొనేషియా, ఫిలిప్పీన్స్ ఉన్నాయి.

☞ దక్షిణాఫ్రికాలో జాతీయ అసెంబ్లీకి, ప్రావెన్షియల్ లెజిస్లేచర్లకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. ఈ తరువాత స్థానిక సంస్థలకు ఐదేళ్ల కాలానికి ఎన్నికలు నిర్వహిస్తారు.

☞ స్వీడన్‌లో నైష్పత్తిక ప్రాతిపదికన ఎన్నికలను నిర్వహిస్తారు. పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా సీట్లను

కేటాయిస్తారు. ఇక్కడ పార్లమెంటు, కౌంటీ కౌన్సిళ్లు, మునిసిపల్ కౌన్సిళ్లకు ఒకేసారి ఎన్నికలను నిర్వహిస్తారు. నాలుగేళ్లకోసారి సెప్టెంబర్ రెండో ఆదివారం నాడు ఇవి జరుగుతాయి. మునిసిపల్ ఎన్నికలు ఐదేళ్లకోసారి జరుగుతాయి.

☞జర్మనీలో ఛాన్సలర్ నియామకంతోపాటు అదనంగా అవిశ్వాస తీర్మానం సమయంలో వినియోగించుకునే నిర్మాణాత్మక ఓటు ఉంటుంది.

☞జపాన్‌లో తొలుత ప్రధాని అభ్యర్థిని నేషనల్ డైట్ నిర్ణయిస్తుంది. దానిని రాజు ఆమోదిస్తారు.

☞2019 నుంచి ఇండొనేషియా జమిలి ఎన్నికలను నిర్వహిస్తోంది.

## 32 పార్టీల అంగీకారం, వ్యతిరేకించినవి 15

జమిలి ఎన్నికలపై కోవింద్ కమిటీ 62 పార్టీల అభిప్రాయాలను కోరింది. ఇందులో 47 పార్టీలే స్పందించాయి. 32 పార్టీలు అనుకూలంగా స్పందించగా, 15 వ్యతిరేకించాయి. మరో 15 పార్టీలు స్పందించలేదు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తోంది. జాతీయ పార్టీల్లో బీజేపీ, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) జమిలిని సమర్థించాయి. కాంగ్రెస్, ఆప్, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ), సీపీఎం వ్యతిరేకించాయి. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగ మౌలి క నిర్మాణాన్ని తక్కువ చేసి చూపుతాయని కాంగ్రెస్, ఆప్, సీపీఎం ఆరోపించాయి. జమిలిని బహిరంగంగా వ్యతిరేకించకపోయినా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అమలు సవాలుతో కూడుకున్నదని బీఎస్‌పీ వ్యాఖ్యానించింది. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడలేవని, వ్యయం విషయంలో అంతరాలు కనిపిస్తాయని సమాజ్‌వాదీ పార్టీ అభిప్రాయపడింది.

**మద్దతిచ్చిన రాష్ట్ర పార్టీలు**

ఏఐఏడీఎంకె, ఆల్ ఇండియా జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్, అప్నాదళ్ (సోనేలాల్), అసోం గణ పరిషత్, బిజూ జనతాదళ్, లోక్ జన్‌శక్తి, మిజో నేషనల్ ఫ్రంట్, ఎన్‌డీపీపీ, శివసేన, జేడీయూ, సిక్కిం క్రాంతికారీ పార్టీ, శిరోమణి అకాలీదళ్, యూపీపీఎల్.

**వ్యతిరేకించిన రాష్ట్ర పార్టీలు**

ఏఐయూడీఎఫ్, తృణమూల్ కాంగ్రెస్, ఏఐఎంఐఎం, సీపీఐ, డీఎంకె, నాగా పీపుల్స్ ఫ్రంట్, సమాజ్‌వాదీ, వీటితోపాటు మరికొన్ని పార్టీలు

**స్పందన తెలపని పార్టీలు**

టీడీపీ, వైకాపా, బీఆర్ఎస్, ఐయూఎంఎల్, ఎన్‌సీ, జేడీఎస్, జేఎంఎం, కేరళ కాంగ్రెస్, ఎన్‌సీపీ, ఆర్జేడీ, రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ, ఆర్ఎస్‌పీ, ఎస్‌డీఎఫ్.

## ఒకేసారి ఎన్నికలతో మొదలై..

**స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో మన దేశంలో ఏకకాల ఎన్నికలే జరిగాయి. ఇప్పుడు మళ్లీ ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.**

**1951–52, 1957, 1962, 1967:** లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగాయి. ఇలాంటి ఏర్పాటుకి వీలుగా బీహార్, బొంబాయి, మద్రాస్, మైసూర్, పంజాబ్, యూపీ, పశ్చిమ బెంగాల్ శాసనసభలను వాటి పదవీకాలం ముగియకముందే రద్దు చేశారు.

**1961–70:** బీహార్, కేరళ, పంజాబ్, యూపీ, బెంగాల్‌లలో మూడేసి సార్లు ఎన్నికలు జరిగాయి.

**1971–80:** ఈ పదేళ్లలో పరిస్థితి మరింత దిగజారింది. ఏకంగా 14 రాష్ట్రాల్లో మూడుసార్లు ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ఒడిశాలోనైతే నాలుగు సార్లు జరిగాయి.

**1981–90:** ఐదు రాష్ట్రాల్లో మూడేసిసార్లు చొప్పున ఎన్నికలను నిర్వహించారు

**1991–2000:** రెండు రాష్ట్రాల్లో మూడుసార్లు శాసనసభ ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఏకంగా నాలుగుసార్లు ఎన్నికలకు వెళ్లింది.

**1983:** ఎన్నికల సంఘం వార్షిక నివేదిక.. జమిలి ఎన్నికల ఆలోచనను తెరపైకి తెచ్చింది.

**2002:** వేర్వేరుగా ఎన్నికల నిర్వహణ బదులు ఏకకాలానికి మారాలని 'రాజ్యాంగం పనితీరుపై సమీక్షకు నియమితమైన జాతీయ కమిషన్' కోరింది. 1999, 2015, 2018లలో లా కమిషన్ కూడా ఒకేసారి ఎన్నికలకు సిఫార్సు చేసింది.

**2015:** సిబ్బంది, ప్రజాఫిర్యాదులు, న్యాయశాఖల స్థాయీ సంఘం సమగ్రంగా అధ్యయనం చేసి, రెండు దశల్లో ఏకకాల ఎన్నికల పూర్తికి ఆచరణాత్మక విధానాలు సూచించింది.

**2017 జనవరి:** లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపటంపై విశ్లేషణకు నీతిఆయోగ్ వర్కింగ్ పేపర్

**2019:** పాలనా సంస్కరణలపై ఢిల్లీలో అఖిలపక్ష సమావేశంలో చర్చ, ప్రధానాంశాల్లో ఒకటిగా జమిలి ఎన్నికలు

## ఎప్పటి నుంచి అమలయ్యే అవకాశం

జమిలి ఎన్నికల గురించి ఎన్నికల ముందు నుంచి బీజేపీ మాట్లాడుతోంది. ఒకవేళ బిల్లు ఆమోదం పొందితే యూనియన్ ప్రభుత్వం వచ్చే ఎన్నికలనాటికి జమిలి ఎన్నికలను అమలు చేసే అవకాశముందని భావిస్తున్నారు. యూనియన్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఒకేసారి మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ సీట్ల పెంపు, జమిలి ఎన్నికల

**స్వల్పకాల వ్యవధిలో జరుగుతున్న ఎన్నికల్లోనూ మారుతున్న ఓట్ల శాతం**

రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు వేర్వేరుగా కొన్ని నెలల అంతరంలోనే జరుగుతున్నా పార్టీలకు వస్తున్న ఓట్ల శాతంలో మార్పుల నేపథ్యంలో ఒకేసారి ఎన్నికలు జరిగితే ఏం జరుగుతుందన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఓట్లలో కేవలం ఒక శాతం మాత్రమే అంతరం ఉంటుండగా, బీఆర్ఎస్, బీజేపీ సాధించిన ఓట్లలో భారీ అంతరం ఉంది. బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓట్లు దక్కించుకున్నా ఆ తర్వాత అయిదారు నెలల్లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో భారీగా పెంచుకుంది. 2018 అసెంబ్లీ, 2019 లోక్‌సభ ఎన్నికల్లో అదే నిర్ధారణ అయింది. 2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే పునరావృతమైంది.

**బీజేపీకి పెరిగింది 12.8 శాతం ఓట్లు**

2018 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోలిస్తే 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1.4 శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. బీఆర్ఎస్‌కు 5.2 శాతం ఓట్లు తగ్గాయి. బీజేపీ 12.8 శాతం ఓట్లు అసెంబ్లీ కన్నా లోక్‌సభ పోరులో ఎక్కువ తెచ్చుకుంది.

**బీఆర్ఎస్‌కు తగ్గింది 20.67 శాతం ఓట్లు**

2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా పార్టీలు ఓట్ల సాధనలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 0.7 శాతం ఓట్లు అధికంగా సాధించింది.

బీఆర్ఎస్‌కు అసెంబ్లీ కన్నా లోక్‌సభకు 20.67 శాతం ఓట్లు తగ్గాయి. ఒక్క లోక్‌సభ స్థానంలో కూడా గెలవలేదు. ఇదే సమయంలో బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లను గణనీయంగా పెంచుకుంది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 22 శాతం అంతరం ఉంది.

విధానాన్ని అమలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. గత సార్వత్రిక ఎన్నికలకు ఆరు నెలల ముందు.. అంటే 2023 సెప్టెంబర్ 21న చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించే బిల్లు (128వ రాజ్యాంగ సవరణ)ను ఆమోదించింది. జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గ ప్రతివర్గాల పునర్విభజన ఆమోదించి చట్టం తీసుకొచ్చిన ఎన్డీయే ప్రభుత్వం దాని అమలును మాత్రం వాయిదా వేసింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను (డీలిమిటేషన్) నిర్వహించి మహిళలకు సీట్లు కేటాయించనున్నట్లు యూనియన్ ప్రభుత్వం బిల్లులో పేర్కొంది. ఈ సీట్లు పదిహేనేళ్లపాటు మహిళలకు రిజర్వు అవుతాయని తెలిపింది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల అమలు కోసం డీలిమిటేషన్ కమిషన్

## వేర్వేరుగా ఎన్నికల్లో పార్టీలవారీ సీట్లు, ఓట్లు

| | 2018శాసనసభ | | 2019 లోక్‌సభ | |
|---|---|---|---|---|
| పార్టీ | సీట్లు | ఓట్ల శాతం | సీట్లు | ఓట్ల శాతం |
| బీఆర్ఎస్ | 88 | 46.9 | 9 | 41.7 |
| కాంగ్రెస్ | 19 | 28.4 | 3 | 29.8 |
| బీజేపీ | 1 | 6.9 | 4 | 19.7 |

| | 2023 శాసనసభ | | 2024 లోక్‌సభ | |
|---|---|---|---|---|
| పార్టీ | సీట్లు | ఓట్ల శాతం | సీట్లు | ఓట్ల శాతం |
| కాంగ్రెస్ | 64 | 39.40 | 8 | 40.10 |
| బీఆర్ఎస్ | 39 | 37.35 | 0 | 16.68 |
| బీజేపీ | 8 | 13.90 | 8 | 36.08 |

**ఈ విధానం అమల్లోకి వచ్చాక దేశవ్యాప్తంగా అన్ని ఎన్నికలకూ ఒకే ఓటరు జాబితాను ఉపయోగిస్తారు.**

ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3) ప్రకారం 2026 అనంతరం ప్రచురించే తొలి జనాభా లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా సీట్లు పెంచుకోవటానికి అవకాశం ఉంది. ఇప్పుడు యూనియన్ ప్రభుత్వం 2021 జనగణనను త్వరలో మొదలు పెట్టబోతుండటం, ఆ వివరాలను 2026 తర్వాత ప్రచురించే అవకాశం ఉండటంతో ఒకేసారి దేశవ్యాప్తంగా సీట్లను పెంచటంతోపాటు, మహిళలకు కేటాయించే సీట్లను రిజర్వ్ చేయటం కోసం డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేసి 2029 నాటి కల్లా వేదికను సిద్ధం చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందువల్ల సార్వత్రిక ఎన్నికల్లో పెంచిన సీట్లతోపాటు మహిళా రిజర్వేషన్లు అమల్లోకి రావొచ్చని పేర్కొంటున్నారు. దీనివల్ల లోక్‌సభ స్థానాలు ఇప్పుడున్న 543 నుంచి 753కి పెర గొచ్చున్న అంచనా ఉంది. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా వృద్ధి రేటు తగ్గటం వల్ల వచ్చే జనాభా లెక్కల్లో దక్షిణాది రాష్ట్రాల్లో తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగే అవకాశం ఉంటుందని, దాని ప్రకారం పార్లమెంటు సీట్లలో కూడా హెచ్చుతగ్గులు కనిపించవచ్చనే అభిప్రాయం ఉంది.

### ఎన్‌డీయే 3.0 సంఖ్యా బలం సరిపోతుందా?

రాజ్యాంగ సవరణను పార్లమెంటు 2/3 మెజారిటీతో ఆమోదించాలి. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీ ఆ మార్కు దాటాలంటే సొంత బలగంతోపాటు అదనంగా ఎంపీల మద్దతు కూడగట్టాల్సి ఉంటుంది. రాజ్యసభలో మరింత ఎక్కువ కష్టపడాల్సి ఉంది.

**లోక్‌సభలో..**

ప్రస్తుత ఎన్‌డీయే బలం: **293**

జమిలి ఆమోదానికి అవసరం: **362**

**రాజ్యసభలో..**

ప్రస్తుత ఎన్‌డీయే బలం: **121**

జమిలి ఆమోదానికి అవసరం: **164**

**రాష్ట్రాల్లో..**

మనది కేవలం పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే కాకుండా సమాఖ్య వ్యవస్థ కూడా. అంటే రాష్ట్ర ప్రభుత్వాల మాటకూ విలువ ఉంటుంది. వాటినీ ఒప్పించాలి. అందుకే పార్లమెంటుతోపాటు దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు అంగీకరించాలి. అంటే 14 రాష్ట్రాలకు పైగా జమిలికి అంగీకరించాలి. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే 20 రాష్ట్రాల్లో (బీజేపీ సొంతంగా 13 రాష్ట్రాల్లో) అధికారంలో ఉంది.



## ఏకకాల ఎన్నికల కోసం మూడు బిల్లులు



దేశంలో ఏకకాల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసేలా మూడు బిల్లులను తీసుకువచ్చేందుకు యూనియన్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని సమాచారం. వీటిలో రాజ్యాంగ సవరణకు ఉద్దేశించినవి రెండు ఉంటాయి. లోక్‌సభ- శాసనసభ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించటానికి కనీసం సగం రాష్ట్రాల నుంచి ఆమోదం అవసరమవుతుంది. 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' ప్రణాళిక కింద ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సుల్ని ప్రభుత్వం ఇటీవలే ఆమోదించిన విషయం తెలిసిందే. దేశవ్యాప్త ఏకాభిప్రాయ సేకరణ తర్వాత దశలవారీగా దీనిని అమలు చేయనున్నారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను కలిపి నిర్వహించటానికి రాజ్యాంగంలోని 82-ఏ అధికరణంలో మార్పు చేసేలా మొదటి బిల్లును ప్రతిపాదిస్తున్నారు. లోక్‌సభ పదవీకాలం, దాని రద్దుపై 83 (2) లో అనుబంధ నిబంధనలు చేర్చనున్నారు. అసెంబ్లీ రద్దుకు రాజ్యాంగంలోని 327 అధికరణాన్ని సవరించి 'ఏకకాల ఎన్నికలు' అనే పదాన్ని చేర్చనున్నారు. ఈ బిల్లుకు 50% రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు. ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన రెండో సవరణకు మాత్రం రాష్ట్రాల శాసనసభల ఆమోదం ఉండాలి. రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు వేర్వేరు సంస్థలు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసనసభలు, శాసనమండళ్ల ఎన్నికలను ఈసీ నిర్వహిస్తుంది. పురపాలక సంఘాలు, పంచాయతీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహిస్తుంది. లోక్‌సభ–శాసనసభ ఎన్నికలతోపాటు పురపాలక సంఘాలు, పంచాయతీలకూ ఎన్నికలు నిర్వహించేలా 324-ఏ అధికరణాన్ని సవరించటం రెండో బిల్లు ఉద్దేశం. శాసనసభలున్న మూడు కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించి మూడో బిల్లును ప్రవేశపెడతారు. దీనికి రాష్ట్రాల సమ్మతి అవసరం లేదు. ★

# మహిళల భద్రతకు మరింత భరోసా ఎలా ఇవ్వగలం, వారి స్వేచ్ఛను మరింత ఎలా పెంచగలం?

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

కోల్‌కతా ఆసుపత్రిలో యువ ఫిజీషియన్‌పై దారుణ అత్యాచారం, హత్య ఉదంతం దేశాన్ని కుదిపేసింది. అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, పరువు హత్యలు మొదలైన నేరాలు మహిళలపై పెరుగుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హేయమైన నేరాలు జరిగినప్పుడల్లా మరింత కఠిన చట్టాల్ని అమలు చేస్తున్నారు, ఇంకా ఎక్కువ శిక్షలు వేస్తున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని చంపేయటాల్ని సమాజం ప్రోద్బలంతో ప్రోత్సహిస్తున్నారు. అయినా మన పిల్లలు, మహిళలు ఏమైనా సురక్షితంగా ఉన్నారా? కాబట్టి ఏం చేయాలి మనం?



మన దేశంలో ఏటా సుమారు 30,000 అత్యాచారాలు నమోదవుతున్నాయని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) వెల్లడిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యాచారాల్లో అత్యధికం రికార్డులకెక్కటం లేదని పలువురు నిపుణులు భావిస్తున్నారు. భారత్‌లో కూడా బహుశా అత్యాచారాల్లో 25–30% మాత్రమే నమోదవుతున్నాయి. జనాభా ప్రాతిపదికన లెక్కేస్తే మహిళలపై అత్యాచారాలు మనదేశంలో కంటే ప్రపంచవ్యాప్తంగా ఇంకా చాలా ఎక్కువ. 6.5 కోట్ల జనాభా ఉన్న బ్రిటన్‌లో ఏటా 16,000 రేప్‌లు నమోదవుతున్నాయి. 33 కోట్ల జనాభా ఉన్న అమెరికాలో సుమారు 100,000 కేసులు నమోదవుతున్నాయి. అయితే, అత్యాచారాల సంఖ్య మనదేశంలో తక్కువేనని సంతృప్తి చెందటం ప్రమాదకరం. ఎందుకంటే, ఒక్క కేసయినా కూడా లైంగిక హింస తీవ్రమైనదే. ఎంతమాత్రం సహించకూడదు. లైంగిక హింస పట్ల ఇటీవలి సంవత్సరాలలో మనలో స్పృహ, సున్నితత్వం మరింత పెరిగాయి. సహించే ధోరణి తగ్గింది. గతంలో నేర న్యాయ వ్యవస్థ బాధితురాలినే అవమానించేది. లైంగిక దాడులకు పాల్పడేవారి దృష్టిని 'ఆహ్వానించావని' ఆమెనే నిందించేవారు. ఏదో ఒక సాకును చూపి నేరస్తుల్ని వదిలేసేవారు. ఎన్నో తప్పటడుగులు వేశాక, ఎట్టకేలకు చట్టాల్ని బలోపేతం చేశారు. కోర్టులు మరింత సున్నితత్వాన్ని, బాధితురాలి పట్ల స్నేహపూర్వక ధోరణిని ప్రదర్శిస్తున్నాయి.

తీవ్రమైన నేరాలలో మరణశిక్ష విధించాలనటంలో ఏమాత్రం సందేహం లేదు. కానీ కాగితాల మీద మరింత కఠినమైన శిక్ష నేరస్తుల్ని నిరోధించలేదు. 'అభయ' ఉదంతంలో పెద్దఎత్తున ప్రజాందోళనలు కొనసాగుతున్న సమయంలోనే మీడియాలో కొన్ని వార్తలు వచ్చాయి. రాజస్థాన్‌లో పలువురు రేపిస్టులకు వారి నేరాలు వెలుగులోకి వచ్చిన మూడు దశాబ్దాలు దాటిన తర్వాత శిక్షలు పడ్డాయి! ఇప్పటికిప్పుడు 130,000 పైగా అత్యాచార కేసులు దేశ ట్రయల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం అత్యాచారం వంటి దారుణ నేరాల్లో వేగంగా, కచ్చితంగా, కఠినంగా శిక్షలు పడు తుండాలి. మన న్యాయవ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. మన కోర్టుల్లో 5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో మూడింట రెండొంతులు క్రిమినల్ నేరాలు. మనం చట్టం అమలుకు జీడీపీలో కేవలం 0.7% మాత్రమే ఖర్చు చేస్తున్నాం. పరిశోధన, ఫోరెన్సిక్స్, ప్రాసిక్యూషన్, కోర్టులు. చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసే దేశాలు చట్టబద్ధపాలన కోసం 1.5 నుంచి 2.5% ఖర్చు చేస్తున్నాయి.

మనం మొత్తం నేర న్యాయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. సివిల్, క్రిమినల్ రెంటినీ. పరిశోధన , ఫోరెన్సిక్స్, విచారణ ప్రక్రియలు, ప్రాసిక్యూషన్, జ్యుడీషియరీతో సహా. భారత్‌లో బడితె ఉన్నవాడిదే బర్రె అయింది. సాయుధ గూండాలు, సంఘటిత నేరస్తులు 'అప్రకటిత న్యాయమూర్తులు' అయ్యారు. కొంత రేటు వసూలు చేసి కండబలంతో బండ న్యాయాన్ని తక్షణ న్యాయంగా అందిస్తున్నారు. చట్టబద్ధపాలన వైఫల్యం పట్ల సమాజం స్పందన అది. అయినా, ఏ రాజకీయ పార్టీ ఎజెండాలో చట్టబద్ధపాలన లేకపోవటం బాధాకరం. హీనపక్షం, అత్యాచారం, హత్య, మానవాపహరణ వంటి దారుణ నేరాలలో మనం సకాలంలో, నిష్పక్షపాతంగా, పటిష్ఠంగా నేర పరిశోధన, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్, వేగంగా విచారణకు గ్యారంటీ ఇవ్వాలి.

మహిళల పట్ల క్రూరమైన నేరాలకు శిక్షలు విధించటంలో న్యాయవ్యవస్థ సామర్థ్యం పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోయినందు వల్ల చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వారిని చంపేయండని ప్రభుత్వాలు, పోలీసులపై ఒత్తిడి వస్తోంది. తక్షణ న్యాయం వల్ల తలెత్తే ప్రమాదాన్ని తరచుగా అనేకమంది అమాయక పౌరులు పెద్దగా గుర్తించలేక పోతున్నారు. పోలీసు సిబ్బందే జడ్జీ, ధర్మాసనం, శిక్ష అమలుదారులుగా వ్యవహరిస్తూ నేరస్తుల్ని చంపేయటాన్ని శభాష్ అంటున్నారు.

హేయమైన నేరాలకు పాల్పడ్డవారి కోసం ఎవరూ కన్నీరు కార్చరుగానీ, నకిలీ 'ఎన్‌కౌంటర్ల' వల్ల ప్రమాదాలు సుస్పష్టం; 'ప్రతీకార న్యాయం' కోసం డిమాండ్ చేస్తున్న ప్రజల సెంటిమెంట్‌ను తృప్తిపరచటం కోసమో, లేదా అధికారంలో ఉన్నవారికి ఆగ్రహం తెప్పించే ఇబ్బందికరమైన అసమ్మతివాదులను చంపటం కోసమో చట్టవిరుద్ధంగా చేసే 'ఎన్‌కౌంటర్ల'కి త్వరలోనే అమాయక పౌరులు బలిపశువులవుతారు. ముఖ్యంగా క్రూరమైన నేరాలకు సంబంధించి న్యాయవ్యవస్థను సంస్కరించటం ఇక ఏమాత్రం ఆలస్యం కాకూడదు. మనకు ఇప్పుడు కావలసింది ఆచరణ.

తీవ్రమైన లైంగిక హింసను తగ్గించటానికి చేయాల్సింది ఇంకా చాలా ఉంది. రోజువారీ ప్రాతిపదికన చూస్తే, లక్షల మంది మహిళలు ఈవ్ టీజింగ్, వేధింపులు, సైగలు, అసభ్య, కించపరిచే కామెంట్లు, బహిరంగ ప్రదేశాలలో అనుమతిలేకుండా తాకటం లాంటి నేరాలకి బాధితులుగా ఉన్నారు. ఎక్కువమంది మహిళలు ఈ రోజువారీ హింస పట్ల చూసీచూడనట్లు వ్యవహరించటం నేర్చుకున్నారు. ఈ తొలిదశలో నేరాలకు శిక్షలు కొరవడటం వల్ల లైంగిక వేధింపులని ఉపేక్షించే సంస్కృతి కొనసాగుతోంది; దీంతో, తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు కొందరు నేరస్తులు అత్యాచారం, హత్యల్లో పట్టభద్రులవుతున్నారు. సులభ విచారణ పద్ధతులతో చిన్న కేసుల్లో అత్యధిక శాతాన్ని పరిష్కరించటం కోసం 2009లో గ్రామ న్యాయాలయాల చట్టం అమల్లోకి తెచ్చారు. కానీ చాలా రాష్ట్రాల్లో అమలు కాకుండా శాసన పుస్తకాల్లో మిగిలిపోయింది. చట్టబద్ధపాలన అవసరం మరింతగా పెరుగుతున్న పట్టణాలు, నగరాలకు ఈ చట్టాన్ని విస్తరించేలా సవరించి, మహిళలపై చిన్న నేరాల కట్టడి పట్ల ప్రత్యేక శ్రద్ధ ప్రదర్శించాలి. దేశవ్యాప్తంగా 10,000 స్థానిక కోర్టులను ఏర్పాటు చేయాలి. సివిల్ కావచ్చు, క్రిమినల్ కావచ్చు, సాపేక్షంగా చిన్న కేసులను సులభ విచారణతో 90 రోజుల్లోగా పరిష్కరించాలి. హింసాత్మక అల్లర్లకు పాల్పడ్డవారికి సరైన విచారణ ప్రక్రియలో బ్రిటన్ 15 రోజుల్లోగా శిక్షలు




విధించగలిగినప్పుడు, చిన్న కేసుల్లో రోజులు, వారాల్లో మనం న్యాయం అందించలేకపోవటానికి ఎటువంటి కారణం కనిపించదు. ఇలా లైంగిక వేధింపులకి వెంటనే శిక్షపడే వాతావరణాన్ని కల్పిస్తే, సమాజంలో మహిళలకి భద్రత పెరుగుతుంది. అలాకాక చిన్న నేరాలని ఉపేక్షిస్తే కాలక్రమేణా పెద్దనేరాలు పెరుగుతాయి.

చివరిగా, రేపిస్టులు మన సొంత సమాజం, మన కుటుంబాల నుండే వస్తారు. అత్యాచారాల్లో ఎక్కువశాతం బాధితురాలికి తెలిసినవారే పాల్పడుతున్నారని ప్రపంచవ్యాప్త సాక్ష్యాధారాలు సూచిస్తున్నాయి. వేగంగా, ప్రభావశీలంగా న్యాయాన్ని అందించటం సహాయపడుతుంది. కానీ చాలదు. ఒక మహిళ బహిరంగంగా వేధింపులకు గురవుతున్నప్పుడు, జోక్యం చేసుకోవటాన్ని తిరస్కరించే మౌనప్రేక్షకుల గురించి మీడియాలో అనేక కథనాలు వచ్చాయి. మహిళలు, నేరం, ఇతరులకు 'అన్యాయం' గురించి మన సమాజ సంస్కృతిని మార్చుకోవాలి. మన మగపిల్లల్ని ఇంటి వద్ద పెంచటంలో, స్కూల్‌లో చదివించటంలో మరింత మెరుగ్గా వ్యవహరించాలి. పితృస్వామ్య సమాజంలో అబ్బాయిల్ని ప్రత్యేకమైనవారుగా, రాజకుమారుల్లా పెంచితే, మహిళలు తక్కువ, అణిగిమణిగి ఉండాలి అని వారిని అంతర్లీనంగా నమ్మే విధంగా ఇంటి దగ్గర, పాఠశాలలో మన చర్యలు, దృక్పథం ఉంటే, మహిళలపై హింస మామూలైపోతుంది.

పిల్లల్ని పెంచేటప్పుడు అమ్మాయిల పట్ల వివక్షను ప్రదర్శింకపోవటం, పరస్పర గౌరవం, హద్దుల్ని గుర్తించటం, ఆరోగ్యకరమైన మానవ సంబంధాలను పెంపొందించటానికి చాలా చేయాల్సి ఉంది. అడ్డదారులు లేవు. వారి స్వేచ్ఛను పెంపొందిస్తూ, కుటుంబంలో, సమాజం, ఆర్థిక వ్యవస్థలో తమ న్యాయమైన పాత్రను పోషించగలిగేలా ఇంటి దగ్గర, బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతకు మనం గ్యారంటీ ఇవ్వటం అవసరం. భద్రత పేరుతో మహిళల్ని వంటింటికి పరిమితం చేయటం పరిష్కారం కాదు. స్వేచ్ఛ, అన్ని రంగాలలో సమాన భాగస్వామ్యం, భద్రత – మూడింటినీ సాధించాలి. ★

# శిక్షణనిస్తే మౌన ప్రేక్షకులూ రక్షకులే

–శ్రీనివాస్ మాధవ్

తమ కళ్ల ఎదుటే ఓ అఘాయిత్యం జరుగుతున్నా చుట్టుపక్కల ఉన్నవారంతా ఎందుకు స్పందించరు? మనకెందుకులే అన్న భావనతో సమాజం కరడు గట్టిపోతున్నదా, బాధితులకు అండగా నిలబడేందుకు ధైర్యం చాలడంలేదా లేక తమకేమయినా హాని జరుగుతుందన్న భయమా? ఇటీవల జరిగిన కొన్ని అత్యాచారాలు చూస్తే అవేమీ నిర్మానుష్య ప్రాంతంలో జరిగినవి కావు. ఫుట్‌పాత్‌పై, రైలులో ప్రజలు మౌన ప్రేక్షకుల్లా ఉండటం వల్ల జరిగాయి. ఈ సామాజిక అమానుష ఘటనలు ఈవేళే జరుగుతున్నవి కావు. గతంలోనూ అనేకం నమోదయ్యాయి. ఈ రాష్ట్రం, ఆ రాష్ట్రం అని తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఈ తరహా పరిస్థితులున్నాయి. కానీ ఈ మౌనప్రేక్షకుల్లో కొందరికైనా తాము ఆ క్షణంలో శిలలాగా మిగిలిపోయామనే మనోవేదన కచ్చితంగా ఉంటుంది.




అటువంటి వారిని నేరాలను ప్రతిఘటించగల, లేదా తీవ్రతను తగ్గించగల స్థాయికి తీసుకెళ్లేందుకు కొంత శిక్షణ ఇవ్వటం అవసరం. పశ్చిమ దేశాల విశ్వవిద్యాలయాలలో బైస్టాండర్ ఇంటర్వెన్షన్ (సామాజిక స్పందన) శిక్షణ తప్పనిసరిగా ఇస్తున్నారు. ఒకటి, రెండు గంటల్లో పూర్తయ్యే ఈ శిక్షణ తర్వాత యువత తమ కళ్ల ఎదుటే జరిగే దాడులను, వేధింపులను, నేరాలను ఆపగలుగుతున్నారు. అంతటి సమూల మార్పు తెచ్చే ఈ శిక్షణలో బోధించే అంశాలు ఏమిటి?

అందరూ మౌనంగా ఉన్నప్పుడు తానొక్కడే ముందుకు అడుగు వేస్తే ఆ సమూహాన్ని ధిక్కరించినట్లవుతుందేమో అన్న సంశయమే ఈ కొందరిని కదలకుండా చేస్తుంది. దీన్ని అధిగమించి ముందడుగు వేయడమే ప్రతి వ్యక్తికి ఒక సవాలు. ఒకరిపై ఈరోజు దాడిని సహిస్తే మరొక రోజు తన వంతు రావచ్చు. ఎదుటి వ్యక్తి బాధపడుతుంటే సానుభూతి చూపించటం, తాను కూడా బాధకు లోనుకావటం ఆత్మీయత. తనకు ప్రమాదం లేకుండా ఒక ఘటనలో ఎలా జోక్యం చేసుకోవచ్చో ఈ శిక్షణలో బోధిస్తారు. దీనివల్ల చొరవగా ముందుకు వెళ్లి నేరాలను ఆపగలిగే ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రజల్లో వస్తోంది. దీనికి చిన్న చిన్న చిట్కాలు కూడా ఉపయోగపడతాయి. ఉదాహరణకు ఓ వ్యక్తి అమ్మాయిని వేధిస్తున్నాడనుకుంటే, మనం చూస్తూ ఊరుకోకుండా వెళ్లి ఫలానా స్కూల్‌కి దారి ఎటు? టైం ఎంత? వంటి ప్రశ్నలు అడిగితే ఆ ఆకతాయి దృష్టి మరలి బాధితురాలు తప్పించుకోవడానికి అవకాశం దొరుకుతుంది. ఇది కూడా సాధ్యం కాకపోతే ఫోన్‌లో ఏదో మాట్లాడుతున్నట్టు అక్కడ నిలబడ్డారనుకోండి, కొంత ఫలితం ఉంటుంది. అలాగే, కాస్త దూరంగా నిలబడి ఫోన్ కెమెరాతో వీడియో రికార్డ్ చేయటం కూడా నేరస్తులకు భయం కలిగిస్తుంది, సాక్ష్యంగానూ పనిచేస్తుంది.

ఒక్కోసారి చిన్న పలకరింపు కూడా ప్రాణాలు కాపాడవచ్చు. ఆమధ్య ఢిల్లీలో బ్రహ్మదత్ అనే వ్యక్తి తానెక్కిన ఆటోలో మరో వ్యక్తితో ఉన్న ఇద్దరు బాలికలతో మాట్లాడుతూ అనుమానం వచ్చి ఆ వ్యక్తి మీకు ఏమవుతాడు? అని ప్రశ్నించాడు. ఆ బాలికలు అతడు తమకు ఏమీ కాదని చెప్పటంతో ట్రాఫిక్ కానిస్టేబుల్‌కి బ్రహ్మదత్ ఆ విషయం చెప్పాడు. పోలీసుల రంగప్రవేశంతో ఆ వ్యక్తి ఆ బాలికలను అక్రమ రవాణా చేస్తున్నట్టుగా తేలిపోయింది. అందరినీ ప్రాధేయపడిన అఫ్రీన్ సుల్తానా చివరికి తానే హంతకుడిపైన ప్రతిదాడి మొదలుపెట్టడంతో ప్రేక్షకుల్లో ఒక్కసారిగా చలనం వచ్చి తామూ రంగంలోకి దిగారు. అంటే, అంతవరకు గుంపులో ఒకరిగా ఉండిపోయిన సుల్తానా ముందడుగు వేసి ప్రతిదాడికి ప్రయత్నించిన మరుక్షణంలో మౌనప్రేక్షకులంతా చైతన్యవంతంగా మారారు. కొద్ది క్షణాల ముందే ఈ ప్రతిదాడి మొదలుపెట్టి ఉంటే నాగరాజు ప్రాణాలను కాపాడగలిగి ఉండేవారు. మౌనంగా ఉండిపోవటం బాధ్యతారహితమనే భావనను పౌరులలో పెంచగలిగితే ప్రజాస్థలాల్లో జరిగే వేధింపులను, నేరాలను చాలావరకు నిరోధించవచ్చు. ఈ బైస్టాండర్ ఇంటర్వెన్షన్ శిక్షణ పిల్లల, మహిళల అక్రమ రవాణా ఆపడానికి, రోడ్డు ప్రమాదాలలో, ఆరోగ్య అత్యవసర పరిస్థితులలో బాధితులను రక్షించేందుకు, అవినీతిని ప్రశ్నించడానికి ఉపయోగపడుతుంది.

అమెరికా 2013లో ఆమోదించిన క్యాంపస్ సెక్సువల్ వయొలెన్స్ ఎలిమినేషన్ యాక్ట్ ప్రభుత్వ నిధులు అందుతున్న కళాశాలల్లో ఈ శిక్షణ తప్పనిసరి చేసింది. మన దేశంలో కూడా విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు బైస్టాండర్ ఇంటర్వెన్షన్ తప్పనిసరి చేసినప్పుడే ప్రజల రాజ్యాంగబద్ధమైన జీవించే హక్కుకు సార్థకత. ★



# విజయవాడ వరదలు - కొన్ని పరిష్కారాలు

- సంతోషిణి

ఇటీవల విజయవాడకి భారీ వరదలొచ్చాయి. ముఖ్యంగా డ్రెయిన్ సామర్థ్యం కంటే ఎక్కువగా బుడమేరు ప్రవహించటం వల్ల లోతట్టు ప్రాంతాలు ముంపుకి గురయ్యాయి. ఖమ్మం, తెలంగాణలోని కొన్ని ఇతర ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా నాలుగు రోజుల్లో 60,000 క్యూసెక్కుల కంటే ఎక్కువ వరదనీరు బుడమేరు డ్రెయిన్‌లోకి చేరింది. అయితే ఆ వాగు గరిష్ట సామర్థ్యం కేవలం 11,000 క్యూసెక్కులే. బుడమేరు వరదనీరు కృష్ణా నదిలో కలిసే విధంగా 12 అడుగులకు తక్కువ నీటి మట్టాన్ని ఉంచేందుకు ప్రకాశం బ్యారేజీ నిర్మాణం జరిగింది. కానీ నదిలో అప్పటికే నీటి మట్టం గరిష్టస్థాయిలో ఉండటంతో ఈసారి వచ్చిన వరదనీటిని అదుపులో పెట్టలేకపోయింది. ఫలితంగా నివాస ప్రాంతాల్లో భారీ వరదలు సంభవించాయి.

ఈ నేపథ్యంలో మనం వరదలను అర్థం చేసుకోవటం అవసరం. వరదలు సహజసిద్ధ పరిణామాలని, వాటిని పూర్తిగా నియంత్రించటం సాధ్యంకాని పని అని ముందుగా గుర్తించాలి. వాటిని కేవలం సమర్థంగా మనం నిర్వహించగలం. భారతదేశంలో, వాతావరణ మార్పులు వర్షపాత అనిశ్చితిని పెంచాయని ఆధారాలు సూచిస్తున్నాయి. దేశ పశ్చిమ తీర ప్రాంతాలు, మధ్యభాగాల్లో వర్షపాతం మూడురెట్లు పెరిగిందని, కుండపోతలా కురవటం తరచూ ఒక్కసారిగా వరదలు సంభవించడానికి తరచూ దారితీస్తోందని వెల్లడిస్తున్నాయి. గత 10 సంవత్సరాల్లో 64% మండలాల్లో (తాలూకాల్లో) భారీవర్షం కురిసే రోజులు సంవత్సరానికి 1-15 రోజులు పెరిగాయి. 1950 నుండి రోజువారీ అత్యధిక వర్షపాతం (రోజుకు 150 మిల్లీ లీటర్లకు మించి) 75% పెరిగిందని సమాచారం చెబుతోంది. సీజన్‌లో కలిగే వర్షపాతం సగం సుమారు 20-30 గంటల వ్యవధిలో భారీవర్షాల రూపంలో కురుస్తోంది. రుతుపవన వర్షపాతం 55% భారతదేశ మండలాల్లో పెరిగింది. ఈ పెరుగుదల తక్కువ వ్యవధిలో కురిసే భారీ వర్షాల వల్ల జరిగిందని, ఇవి తరచూ వరదలకు కారణమవుతున్నాయని వెల్లడవుతోంది.

వరద నీరు సహజంగా నదుల నుండి సముద్రంలో కలుస్తాయి. అయితే నదులకు ఎలాంటి హద్దులు ఉండవు. అవి సహజసిద్ధంగా పల్లాన్ని అనుసరించి దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తాయి. ఒకేసారి కుంభవృష్టి కురిసినప్పుడు, నగరాలు, జన సాంద్రత ఉండే ప్రదేశాలలో ఈ వరద ముప్పు ఎక్కువగా కనిపిస్తుంది. పెద్ద నగరాలలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణతో ప్రవాహ మార్గాలలో ఆటంకాలు పెరుగుతుండటం అందుకు కారణం. భూములకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా, నదుల డ్రెయిన్ ప్రాంతాలు, నీటి వనరులు ఆక్రమించబడుతున్నాయి. బుడమేరు విషయంలో, నివాస స్థలాల కోసం పెరుగుతున్న డిమాండ్ కారణంగా డ్రెయిన్ దగ్గర భూమిని ఆక్రమించడం వల్ల నీటిపారుదలకు అడ్డంకి ఏర్పడి, సహజ ప్రవాహాన్ని క్రమబద్ధీకరించడంలో సమస్యలు తలెత్తి, వరద ముప్పు పెరగడానికి దారితీసింది.

ఈ సమస్యను పరిష్కరించడానికి, ఆక్రమణలను తొలగించడం వంటి చర్యలు సాధారణంగా తీసుకుంటారు. ఉదాహరణకు,

తెలంగాణలో హైడ్రా ఆక్రమణలను కూల్చుతోంది, ఇది చట్టపరంగా సమర్థించదగినది. అయితే, ఇది ఒక తాత్కాలిక పరిష్కారం. ఆక్రమణలను తొలగించడం అవసరమైనప్పటికీ, దశలవారీగా, సమగ్ర పద్ధతిలో చేయాలి. పూర్తిగా డ్రెయిన్‌లను అడ్డుకుంటున్న ప్రాంతాలలో ఆక్రమణలను వెంటనే తొలగించాలి. కానీ, పేదల నివాస ప్రాంతాలు, నిర్మాణాలు ఎక్కువ అడ్డుగా లేనప్పుడు, తక్షణం కూల్చేయకుండా వాటిని వివిధ దశలలో పరిష్కరించే ప్రయత్నం చేయాలి. జోనింగ్ అండ్ గ్రేడింగ్ పద్ధతిలో కొంత నిర్ణీత సమయంలో ఈ ఆక్రమణలను తొలగించవచ్చు.

అయితే దీర్ఘకాలిక పరిష్కారంగా, ప్రస్తుతం ఉన్న నగరాలకు సమగ్ర పట్టణ అభివృద్ధి ప్రణాళిక అవసరం. ఇందులో కాంటూర్ సర్వేలు కీలక పాత్ర పోషిస్తాయి. కాంటూర్ సర్వేలు ఒక ప్రాంతం సహజ భూ స్వరూపాన్ని అర్థం చేసుకోవడంలో ప్లానర్లకు సహాయపడతాయి. మిట్టపల్లాల లెక్కల ఆధారంగా వరదల ప్రవాహానికి అనుగుణంగా రోడ్ల నిర్మాణానికి అవసరమైన వాలును, వరద ముప్పు ఉండే మరింత లోతట్టు ప్రాంతాలను కచ్చితంగా అంచనా వేయడంలో తోడ్పడతాయి. ఉదాహరణకు, లండన్, పారిస్ వంటి నగరాలు తమ పట్టణ నిర్మాణంలో భాగంగా రహదారి నెట్‌వర్క్‌లు, నీటి ప్రవాహాలు, వరద నియంత్రణ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి కాంటూర్ సర్వేలను ఉపయోగించటం వల్ల అత్యంత నివాసయోగ్య నగరాలుగా అంతర్జాతీయ స్థాయిలో విలసిల్లుతున్నాయి.

ముందు చర్చించినట్లుగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణీకరణ భూమి డిమాండ్‌ను మరింత పెంచింది. ఇది మితిమీరి విస్తరణకు, నివాస ప్రాంతాలు కిక్కిరిసి పోవటానికి దారితీస్తోంది. తక్కువ నైపుణ్యం, తక్కువ జీతం కార్మికుల్లో ఎక్కువమంది వరదలకు గురయ్యే దిగువ, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది మెరుగైన ఉపాధి అవకాశాల కోసం తమ ఊరు విడిచి పెద్ద నగరాలకు వలస వచ్చినవారు. కానీ అధ్వాన్నమైన మౌలిక సదుపాయాలతో కూడిన ప్రాంతాల్లో నివసించాల్సిన పరిస్థితి, ఇది ఆక్రమణలకు దారితీస్తుంది. వరదల వల్ల ప్రమాదాన్ని, కష్టనష్టాల్ని పెంచుతుంది.

ప్రస్తుత పట్టణీకరణ నమూనా సుస్థిరాభివృద్ధికి దోహదం చేసేది కాదు. సమస్యను దీర్ఘకాలంలో పరిష్కరించటం, చిన్న పట్టణాల అభివృద్ధిపై దృష్టి సారించటం ఎంతైనా అవసరం. చిన్న పట్టణాల్లో పెట్టుబడి ద్వారా, ప్రధాన నగరాలపై మితిమీరిన ఒత్తిడి తగ్గించవచ్చు, మరింత సమతూకం గల, క్రమబద్ధమైన పట్టణీకరణను ప్రోత్సహించవచ్చు. ఈ చిన్న పట్టణాల అభివృద్ధి కూడా ప్రణాళికాబద్ధంగా జరగటం అవసరం.

వరద నిర్వహణకు, ప్రాంతాలను సమతుల్యం చేయటం, ఆక్రమణను తొలగించడం వంటి చర్యలతోపాటు, డ్రైనేజ్, వరద నియంత్రణ మౌలిక సదుపాయాలను సమగ్రంగా మెరుగుపరచడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. చిన్న పట్టణాల అభివృద్ధిని ప్రోత్సహించడం, సరైన డ్రైనేజ్, తుపాను నీటి వ్యవస్థలను కలిగి ఉన్న సమగ్ర పట్టణ ప్రణాళికను అభివృద్ధి చేయటం ద్వారా దీర్ఘకాలంలో వరదల్ని నియంత్రించే అవకాశం ఉంటుంది. ★

# ఏపీ అభివృద్ధికి లోక్‌సత్తా పార్టీ రోడ్‌మ్యాప్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందటం కోసం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో సమావేశమై రోడ్‌మ్యాప్ అందచేస్తారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ సమీకరణాలు, అభివృద్ధి అంశాలపై హైదరాబాద్‌లోని కార్యాలయంలో జేపీతో చర్చించారు. రాష్ట్రంలో దేశంలో అగ్రగామిగా అభివృద్ధి చెందాలంటే ప్రజలు స్వయంపాలనతోపాటు చట్టబద్ధత పాలనకు అలవాటు పడాలని, ప్రభుత్వంలోని ప్రతి పథకం ప్రజల భాగస్వామ్యంతో ఉండాలని, వ్యక్తి స్వేచ్ఛతోపాటుగా పరిపాలనలో స్వయందిద్దుబాటు అవ సరమని అన్నారు. రాష్ట్రంలో విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయం, స్థానిక ప్రభుత్వాలు తదితర అంశాలపై జేపీ లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి అందచేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల నుండి గట్టెక్కాలంటే పరిపాలనలో ఆర్థిక క్రమశిక్షణ, పరిపాలనలో సమూల మార్పు లు అవసరమని జేపీ అభిప్రాయపడ్డారని, ఉచితాలకు దూరంగా ఉండి ఉపాధి కల్పనలకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారని భీశెట్టి తెలిపారు.

# వయనాడ్ విలయం – పర్యావరణం – అభివృద్ధి

– సునీతా నారాయణ్

ఆ బాధ్యత నా జీవితంలో మహా కఠినమైన పని. పశ్చిమ కనుమలపై మాధవ్ గాడ్గిల్ కమిటీ సిఫారసులను సమీక్షించేందుకు గత ప్రభుత్వం నియమించిన కె.కస్తూరిరంగన్ కమిటీలో ఒక సభ్యురాలుగా ఉండటం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. పశ్చిమ కనుమలను విధ్వంసం నుంచి పరిరక్షించే చర్యల పట్ల ఎందుకు అంత తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోందో మనం చర్చించాల్సిన అవసరమున్నది. ఇటీవల 400 మందిని బలిగొన్న వయనాడ్ విపత్తులాంటి ఉపద్రవాలను చవిచూస్తున్నా పశ్చిమ కనుమల ప్రాంతాల ప్రజలు తమ ప్రాంత పర్యావరణ వ్యవస్థలను కాపాడుకోవడంపై మెరుగైన అవగాహనతో కూడిన శ్రద్ధాసక్తులను ఎందుకు చూపించటం లేదనేది నన్ను బాగా కలవరపెడుతోంది.

సరే, కస్తూరి రంగన్ కమిటీ సభ్యురాలుగా నేను ఎదుర్కొన్న సందిగ్ధావస్థ గురించి తొలుత వివరిస్తాను. కస్తూరి రంగన్ కమిటీ, పౌర సమాజం వాగ్వ్యవహారంలో చెప్పాలంటే, మాధవ్ గాడ్గిల్ కమిటీ సిఫారసులను అస్పష్టం చేసి బలహీనపరిచేందుకు ఏర్పాటు చేసిన కమిటీ. కమిటీ మొదటి సమావేశం జరగకముందే ఏదో తప్పు చేశామనే భావన మాకు కలిగింది. ఆరు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న పశ్చిమ కనుమల ప్రాంతాన్ని సున్నిత పర్యావరణ ప్రాంతం (ఎకలాజికల్లీ సెన్సిటివ్ ఏరియా)గా ప్రకటించాలని మాధవ్ గాడ్గిల్ నివేదిక స్పష్టంగా సిఫారసు చేసింది. అయితే ఆ సిఫారసు ఆ ఆరు రాష్ట్రాలలో ఏ ఒక్కదానికీ ఆమోదయోగ్యం కాలేదు. గాడ్గిల్ నివేదికను తిరస్కరించాయి. కనుక కస్తూరి రంగన్ కమిటీ సభ్యురాలిగా నా విధి నిర్వహణ చాలా జటిలమైదని నాకు బాగా తెలుసు. పశ్చిమ కనుమలను శీఘ్రగతిన పరిరక్షించేందుకు దోహదం చేసే పరిష్కారాన్ని కనుగొనడం ఎలా?

పశ్చిమ కనుమలలో 1,37,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం (80 శాతం)ను సున్నిత పర్యావరణ ప్రాంతంగా ప్రకటించాలని మాధవ్ గాడ్గిల్ కమిటీ సిఫారసు చేసింది. ఈ రక్షిత సున్నిత పర్యావరణ ప్రాంతాన్ని మూడు విభాగాలుగా విభజించి ప్రతి ప్రాంతంలోను అనుమతించదగిన కార్యకలాపాల వివరాలను విపులంగా సమకూర్చింది. ఇదిగో ఈ సిఫారసే తోటల ప్రాంతాలు, వ్యవసాయ భూములు ప్రభుత్వ నియంత్రణకు లోనవుతాయోమోననే భయాలు, సంకోచాలను సృష్టించడానికి దారితీసింది. అయితే ఆ సిఫారసు చేయడంలో మాధవ్ గాడ్గిల్ ఉద్దేశం అది కాదని నేను ఘంటాపథంగా చెప్పుతున్నాను. గాడ్గిల్ నాకు బాగా తెలుసు. పర్యావరణ, ప్రజల జీవనోపాధుల రక్షణకు అంకితభావంతో కృషి చేసిన పర్యావరణవేత్త. సామాజిక సమూహాల హక్కులను సంరక్షించాలని ఆయన సదా వాదించేవారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు సంపూర్ణ భాగస్వాములు కావాలనేది ఆయన ఆకాంక్ష. గాడ్గిల్ నివేదికకు ఆయన ఆకాంక్షకు విరుద్ధమైన భాష్యాలు చెప్పడం చాలా



విచారకరమైన విషయం. ఎందుకలా జరిగింది? పశ్చిమ కనుమల ప్రాంతాలలో విధ్వంసకరమైన 'అభివృద్ధి' కార్యకలాపాలకు కారకులు, రాజకీయ ప్రాబల్యమున్న శక్తిమంతమైన స్వార్థపరశక్తులే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఆరు రాష్ట్రాల ప్రభుత్వాల ప్రతినిధులు, ఇతరులతో చర్చలు జరిపిన అనంతరం కస్తూరి రంగన్ కమిటీ తన సిఫారసులను రూపొందించింది. 2013లో పర్యావరణ పరిరక్షణ చట్టంలోని 5వ సెక్షన్ కింద వాటిని జారీ చేశారు. నోటిఫై అయిన సిఫారసులు మాధవ్ గాడ్గిల్ కమిటీ నివేదికకు రెండు మార్పులు చేశాయి. మొదటిది – పశ్చిమ కనుమలలో సున్నిత పర్యావరణ ప్రాంతాన్ని 59,940 చదరపు కిలోమీటర్లకు కుదించింది. ఉపగ్రహాల ద్వారా తీసిన ఫొటోల ఆధారంగా పశ్చిమ కనుమలలో 60 శాతం తోటలు, వ్యవసాయ భూములు, మానవ ఆవాస ప్రదేశాలుగా ఉన్నాయని నిర్ధారించారు. వీటిని సాంస్కృతిక భూదృశ్యం (కల్చరల్ ల్యాండ్ స్కేప్ – ప్రకృతి, మానవ చర్యలు రెండింటితో తీర్చిదిద్దబడిన ప్రాంతం)గా వర్గీకరించారు. సదరు భూములను ఉపయోగించుకుంటున్న తీరుతెన్నులను వెనక్కి అంటే పూర్వపు పరిస్థితికి మళ్లించలేము. మిగిలిన సహజ భూదృశ్యం (నేచురల్ ల్యాండ్ స్కేప్)ను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఈ సహజావరణంలో 20 శాతానికి పైగా పరిరక్షిత అడవులు, గ్రామాలు ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణ చట్టం ఆ పరిరక్షిత గ్రామాల జాబితాను కూడా పేర్కొంది.

పశ్చిమ కనుమలలో అనుమతిస్తున్న, అనుమతించని కార్యకలాపాల సమగ్ర జాబితాను తయారుచేయకుండా విధ్వంసకర కార్యకలాపాలను చాలావరకు నిషేధించాలని కస్తూరి రంగన్ కమిటీ సిఫారసు చేసింది. దీని ప్రకారం ఇసుక

తవ్వకాలతో సహా సకల మైనింగ్ కార్యకలాపాలు నిషిద్ధమయ్యాయి. కస్తూరి రంగన్ కమిటీ సిఫారసులపై 2013లో జారీ అయిన నోటిఫికేషన్ ఇప్పటికీ అమలులో ఉన్నది. దానికింద పరిరక్షిత పశ్చిమ కనుమలలో నిషిద్ధ కార్యకలాపాలకు పర్యావరణ అనుమతులు ఇవ్వడం లేదు. అయితే ఈ విషయంలో ఒక కీలక మార్పు చోటు చేసుకుంది. కేరళ రాష్ట్ర సంబంధితమైనది.

కస్తూరి రంగన్ కమిటీ సిఫారసుల నోటిఫికేషన్ పై కేరళ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. రక్షిత ప్రాంతాలలో మార్పులు చేయాలని కోరింది. కస్తూరి రంగన్ కమిటీ పేర్కొన్న నేచురల్ ల్యాండ్ స్కేప్‌లోని గ్రామాలను మొత్తంగా పరిరక్షిత ప్రదేశాలుగా వర్గీకరించకూడదని కేరళ ప్రభుత్వం వాదించింది. అందుకు బదులుగా గ్రామ సరిహద్దుల పరిధిలో ఒక ప్రాంతాన్ని పరిరక్షితమైనదిగా, మరొక ప్రాంతాన్ని పరిరక్షితం కానిదిగా పరిగణించాలని కేరళ సూచించింది. ఈ విధంగా కస్తూరి రంగన్ కమిటీ జాబితాలో ఉన్న గ్రామాలలో సున్నిత పర్యావరణ ప్రాంతం ఉంటుంది. ఈ ప్రాంతంలో మైనింగ్ కార్యకలాపాలను అనుమతించాలి. కేరళ ప్రభుత్వం సూచనను ఆమోదిస్తూ 2013లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం 2018లో ఒక సవరణ చేసింది. కేరళ డిమాండ్ చేసిన విధంగా పరిరక్షిత పశ్చిమ కనుమలలోని 3,115 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఆ నోటిఫికేషన్ నుంచి మినహాయించింది.

ఈ నేపథ్యంలో మనం రెండు ప్రధాన విషయాల గురించి మరింత విస్తృతంగా చర్చించవలసి ఉన్నది. ఒకటి – కస్తూరి రంగన్ కమిటీ సిఫారసులలో కేరళ కోరిన సవరణే వయనాడ్ విషాదానికి దారితీసిందా? రెండు– వాతావరణ మార్పు తీవ్రస్థాయిలో చోటుచేసుకుంటున్న ఈ కాలంలో ఏ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ నమూనాకు ప్రజల మద్దతు ఖాయంగా లభిస్తుంది? మరింత స్పష్టంగా చెప్పాలంటే సున్నిత పర్యావరణ ప్రాంతాలలో అభివృద్ధి నమూనాను ఎలా రూపొందించుకోవాలి?

**(వ్యాసకర్త..'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

# అర్బన్ తెలంగాణ మాస్టర్‌ప్లాన్ 2050

'అర్బన్ తెలంగాణ' అభివృద్ధి లక్ష్యంగా మునిసిపాలిటీలన్నింటికీ మార్చి కల్లా 'మాస్టర్‌ప్లాన్ 2050' తయారుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలోనే తొలిసారిగా అర్బన్ (పట్టణ) ప్రాంత అభివృద్ధికి ఈ ప్రణాళికలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి పట్టణానికి సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగం చేయాలని అధికారులకు సూచించింది. ఇందులో భాగంగా ప్రతి పట్టణంలో 'బ్లూ–గ్రీన్' మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టబోతోంది. వీటికి సాయం చేయాలని తాజాగా యూనియన్ ప్రభుత్వానికి ఆర్థికసంఘం ద్వారా ప్రతిపాదనలు పంపింది. 'అర్బన్ తెలంగాణ' పేరుతో పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వడం ప్రశంసనీయమని దేశంలోనే ఇలాంటి ప్రతి పాదనలు తొలిసారి తెలంగాణ నుంచి నుంచే వచ్చాయని ఆర్థిక సంఘం ప్రశంసించడంతో జాతీయస్థాయి నుంచి నిధులు వస్తా యని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది. 'తెలంగాణ మాస్టర్ ప్లాన్ – 2050'లోని ముఖ్యాంశాలు:

**'బ్లూ–గ్రీన్' సదుపాయాలంటే..**

బ్లూ–గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను 2024–26లో రూ.13,700 కోట్లు వ్యయంతో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఉదాహరణకు హైదరాబాద్ నగరంలో మూసీ రివర్ ఫ్రంట్, చెరువుల పునరుద్ధరణ, తాగునీటి సరఫరా, అర్బన్ వరదల నియంత్రణ కార్యక్రమాలు, వ్యర్థాల నిర్వహణ, పట్టణాల్లో హరిత వనాల పెంపకం వంటివన్నీ 'బ్లూ–గ్రీన్' మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పేరుతో పెద్దఎత్తున చేపట్టనున్నారు. ఇక 'గ్రీన్ మొబిలిటీ' (హరిత రవాణా) పేరుతో పట్టణాల్లో, నగరాల్లో విద్యుత్ వాహనాలను పెద్దఎత్తున వినియోగంచేలా ప్రోత్సహించి కాలుష్యాన్ని తగ్గించడం, మెట్రో రైలు విస్తరణ, అవసరమున్న రద్దీ కూడళ్లలో పెద్ద సంఖ్యలో ఫ్లైఓవర్ల నిర్మాణం వంటివి చేపడతారు. గ్రీన్ ఎనర్జీ పట్టణాల పేరుతో ప్రత్యేక ప్రాజెక్టులు చేపట్టనున్నారు. 'హైదరాబాద్ 4.0 – నెట్ జీరో సిటీ – సరికొత్త అర్బన్ ప్రాంతం', నిర్మాణ రంగంలో కర్బన ఉద్గారాలు వెలు వడకుండా అధునాతన పర్యావరణ పరిరక్షణ వినియోగం, సౌర విద్యుత్ వినియోగం వంటి కార్యక్రమాలు 'గ్రీన్ ఎనర్జీ' కింద ఉంటాయి.

**39 చోట్ల మురుగుశుద్ధి**

మూసీ శుద్ధి, అభివృద్ధి అనేది మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గోదావరి జలాలను మూసీలోకి తరలించేందుకు రెండు నదుల అనుసంధానాన్ని రూ.5,500 కోట్లతో చేపట్టనున్నారు. మూసీలోకి మురుగు జలాలు ప్రవేశించకుండా చేరకుండా నగరం చుట్టూ 39 చోట్ల మురుగు, వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్లను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టుకు 'ప్రభుత్వ–ప్రయివేటు భాగస్వామ్యం'తో నిధులు ఖర్చు చేయాలనేది ప్రణాళిక. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు వల్ల నదికి ఇరువైపులా కిలోమీటరు దూరం వరకూ అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ అంచనా. ఈ ప్రాజెక్టుతో నిర్వాసితులయ్యే వారికి సమీప ప్రాంతాలలో అధునాతన వసతులతో రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి ఇస్తారు. ఈ ఇళ్లలో నివసించేవారికి వీధి దుకాణాలు ఏర్పాటు చేసుకునే సదుపాయాలు కల్పిస్తారు. ల్యాండ్ పూలింగ్ విధానంలో భూమిని సేకరించి భూయజమానులు ప్లాట్లు కేటాయిస్తారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు సైతం గోదావరి జలాలను తరలిస్తారు. మీర్ ఆలం చెరువును రూ.1,200 కోట్లతో అభివృద్ధి చేస్తారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ రూ.200 కోట్లతో స్కైవాక్ వంతెనను నిర్మిస్తారు. రాష్ట్రంలో మొత్తం 116 పట్టణాల్లో 155 చెరువుల అభివృద్ధికి రూ.387 కోట్లతో పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పట్టణాల్లో రూ.5,500 కోట్ల వ్యయంతో తాగునీటి సరఫరా పథకాలను, ఇతర పనులను అమలు చేయనున్నారు. ★

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Vote Jugaad October 2024!

## Cooperation based on trust - Jugaad Voters' Government!

**(నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం)**

## ఆచరణయోగ్యమైన స్వజాతీయ జుగాడ్ 50:50 రాజనీతి

ఆలోచనాపరులైన ఓటర్లతో అంతర్గత ప్రజాస్వామ్యంతో కూడిన అవినీతిలేని రాజకీయపార్టీ వ్యవస్థ నిర్మితంకావాలి. అందుకు డబ్బు కావాలి. ఏదీ ఎవరికీ ఉచితంగా రాదని గ్రహించిన వారే జుగాడ్ ఓటర్లు! కోట్లాది భావజాలాల సంకెళ్లనుండి విముక్తి చెందిన "ఓటర్లే" ప్రభువులు (పాలకులు) కాగలరు ! ఒక రెండువేలో, అయిదువేలో లేదా మీస్తోమతుకి తగ్గట్టు ఒక కార్యకర్తగా పదివేల రూపాయిలో మనజీవితంలో ఒకేఒకసారి మెరుగైన భవిష్యసమాజం కోసం విరాళమిచ్చేందుకు సాహసించండి.

జుగాడ్ పార్టీ ప్రారంభదశలో ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రతీ MLA నియోజకవర్గంనుండీ కనీసం ఒక "భావిభారత భాగ్యవిధాత" ( రూ.10వేల విరాళంతో) ముందుకు రావాలని మా విన్నపం. జుగాడ్ ఓటర్లచే నిర్వచించబడిన "75 శాతం మెజార్టీతో సుపరిపాలన" రావాలంటే, ప్రతిపాదిత ద్విపక్ష "జుగాడ్ స్వర్ణభారత్ పార్టీ" (temporary name) లో ప్రవేశం ఎవ్వరికీ ఉచితంగా లభించదు. . రైతన్నలూ, శ్రామికవర్గాలు, లాయర్లూ, డాక్టర్లూ, ఇంజనీర్లూ, ప్రభుత్వోద్యోగులూ, IASలు - IPSలు, MLAలు, MPలు, మీడియామిత్రులతో సహా అందరూ కనీసం రూ. 2000 చొప్పున విరాళమిస్తారని మా విశ్వాసం. గ్రామ సర్పంచులది ప్రధాన భూమిక.

ఈసందర్భంలో నూతనంగా ఉద్యమంలో చేరిన I.R.Rao & Metta Rama Rao గార్లకు స్వాగతం! రామారావుగారు ఈ ఉద్యమం పై ఏమంటున్నారో చూడండి : "ఉచితంగా ఏదీ రాదు. శ్రమించాలి. మంచి పాలన కావాలంటే దానికి ప్రజలు మూల్యం చెల్లించాలి. రాజకీయాలని ప్రజా ధనంతో నడిపిస్తేనే మంచి పరిపాలన సాధ్యం. నాయకుల డబ్బుతో నడిచే రాజకీయం వ్యాపారం అవుతుంది. మంచి పాలన కరువవుతుంది.ఆ దిశగా కృషి చేస్తున్న జుగాడ్ ఓటర్ ఉద్యమంలో శ్రీ పార్ధసారధి గారి ప్రొద్బలంతో సభ్యునిగా చేరడం సంతోషంగా వుంది. Metta Rama Rao, IRS (VRS) [Srikakulam, AP]"

25 నుండి 60 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ-యువకులందరికీ "ప్రతిపాదిత జుగాడ్ పార్టీ ఓటరు" గా ఇదే నా వ్యక్తిగతమైన ఆహ్వానం! సంఘటితంగా ఒక ప్రయత్నం చేద్దాం రండి. సమిష్టి నిర్ణయాలతో పార్టీ నిర్మిద్దాం, త్వరపడండి.

Conceptually, if the leaders of political parties function democratically & transparently with accountability to the members financially as well as in performance of duties within the party in a transparent manner - then the government formed by such political parties can deliver services better than selfish groups of wealthy individuals (with parochial and vested interests)

Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:

Advt

# ప్రకృతి శాపమా?పాలకుల పాపమా? ప్రజల స్వార్థమా?

*తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల "హైడ్రా" పేరు మీద అధికార ప్రతిపక్షాల మధ్య హై డ్రామా నడుస్తుంది.మూసి ప్రక్షాళన, సుందరీకరణ ఆగేదే లేదు అంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగ్గేదేలే అంటున్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు బుడమేరుతో విజయవాడ నగరం, మున్నేరుతో ఖమ్మం నగరం అతలాకుతలమైంది. ప్రపంచవ్యాప్తంగా అర్బన్ ఫ్లడ్స్ అనే మాట నేడు చర్చనీయాంశమయింది. అలాగే చెరువులు,కుంటలు, వాగులు, నదులు, సముద్రాలు కలుషితమైపోతున్న దశలో ఇది ప్రకృతి శాపమా?. పాలకుల పాపమా? ప్రజల స్వార్థమా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. దీనికి సమాధానమే ఈ వ్యాసం.*

భూమి,ఆకాశం, నీరు, నిప్పు, గాలి ప్రకృతి లోని పంచభూతాలు ప్రకోపిస్తే ఏం జరుగుతుందో ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రకృతి వైపరీత్య పరిణామాలను చూస్తే మనకు అర్థమవుతుంది.వివిధ దేశాల్లో వస్తున్న భూకంపాలు,టోరెంటోలు, కొండ చెరియలు విరిగి పడడం, సముద్రాలు ఉప్పొంగడం వల్ల వచ్చే ఉప్పెనలు, సునామీలు చూస్తున్నాం.

ఇవి పూర్వకాలంలో రాలేదా అంటే వచ్చాయి కానీ ప్రస్తుతం ఎక్కువగా వస్తున్నాయి. అదే మనం ఆందోళన చెందాల్సిన విషయం. గతంలో ఎక్కువగా ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరిగేది. శాస్త్ర విజ్ఞానం పెరిగిన కొద్దీ వీటిని ముందుగా అంచనా వేస్తున్నా కూడా ఒక్కోసారి మన అంచనాలకు మించి ప్రకృతి ప్రకోపిస్తుంది. దానికి కారణం ప్రకృతి శాపం మాత్రమే కాదు మానవ తప్పిదంతో పాటు పాలకుల పాపమే అని నిక్కచ్చిగా చెప్పవచ్చు.

ప్రకృతి వనరులను వచ్చే తరాలకు మిగల్చకుండా మనం మన అవసరాల కోసం దోపిడీ చేస్తున్నాం. ఆధునిక మానవ అవసరాల కోసం ప్రకృతి వనరులను యదేచ్ఛగా వాడుకుంటున్నాం. దాని ఫలితంగానే మనకు ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను విశ్లేషించాలి వాటికి పరిష్కార మార్గాలను కనుక్కోవాలి.

ఇటీవల మన తెలుగు రాష్ట్రాలలో మున్నేరు ఖమ్మం పట్టణాన్ని ముంచెత్తింది. బుడమేరు విజయవాడ నగర దుఃఖ దాయిని గా మరోసారి రుజువు చేసుకుంది.

"సాల్ మిలే నదీకే జల్ మే,నదీ మిలే సాగర్ మే, సాగర్ మిలే కౌన్ సె జల్ మే కొయి జానేనా" అనే హిందీ పాత పాట గుర్తుకొస్తుంది.

-బండారు రామ్మోహనరావు

అవును ఆ హిందీ పాట లో పేర్కొన్నట్లు చిన్న చిన్న నీటి "సాల్లు" ఏరులుగా మారి ఆ ఏరులే నదిలో కలిసి చివరికి ఆ నదులు సముద్రం వైపు పరిగెడతాయి. కానీ ఆ సముద్రం ఎక్కడికి పరిగెత్తదు. అక్కడే ఉండిపోతుంది కానీ పర్యావరణాన్ని నాశనం చేస్తున్న మన ఆధునిక అవసరాలు "గ్లోబల్ వార్మింగ్" వల్ల భూగోళం వేడెక్కి ఉత్తర ధ్రువం దక్షిణ ధ్రువం లోని మంచు కరిగి సముద్రపు మట్టాలు పెరిగి సముద్ర తీరంలోని గ్రామాలు ఉన్న పట్టణాలు నగరాలను మెల్ల మెల్లగా కబళిస్తున్నాయి. సంవత్సరానికి రెండు మూడు సెంటీమీటర్లు మన భారత ఉపఖండం ఉత్తరం వైపు పైకి వత్తినట్లు జరుగుతుంటే మనకు తెలియకుండానే లక్షల సంవత్సరాలలో ముడత పర్వతాల పేరు మీద హిమాలయాలు ఏర్పడ్డాయి. అలాగే ఒకనాడు ప్రపంచంలో కలసి ఉన్న అనేక భూభాగాలు ఖండ ఖండాలుగా విడిపోయాయి. ఇదంతా మన కళ్ళముందే జరిగినా కూడా ఎన్నో తరాలు వేల సంవత్సరాలు గడిస్తే కానీ మనకు ప్రస్తుతం ఉన్న భూగోళంలోని మార్పులు కనబడడం లేదు. అలాగే పెరుగుతున్న సముద్ర మట్టాలు కూడా మన కళ్ళ ముందు శిశువులుగా ఉన్నవాడు రోజు రోజుకు పెద్దవారవుతుంటే ఆశ్చర్య చెకితులము కాము. సముద్రమట్టాలు పెరగడం కూడా అలాగే జరుగుతుంది. కానీ మనకు తెలియకుండానే మన కాళ్ళ కింద భూమి కదిలిపోతుంటుంది, కరిగిపోతుంటుంది కూడా.

మనదాకా వచ్చేదాకా మనకే తెలియకుండా ప్రకృతి ప్రకోపానికి మనం బలి అవుతూనే ఉంటాము. చివరికి "చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా కూడా మనకు ఉపశమనం లభించదు".

ఇదంతా మనకు తెలుసు కానీ మనం పట్టించుకోము. మనం మనుషులం కదా! కానీ చరాచర ప్రకృతిలో ఉన్న 84 లక్షల జీవరాశులలో ఉన్న "ఎరుక" మనకు లేకుండా పోతుంది. అందుకే ప్రకృతికి అనుగుణంగా పక్షులు, పశువులు జీవిస్తుంటే ప్రకృతికి వ్యతిరేకంగా మనం ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నాము.

ప్రకృతి అనుకూల జీవన విధానం మాని మనదే గొప్ప అని భావిస్తున్నాము. చివరికి "సబ్ కుచ్ లుటాకే హొష్ మే ఆయేతో క్యా హొగా?". అన్నట్లు అంతా అయిపోయాక మనం గతం తలచి వర్తమానాన్ని మరచి భవిష్యత్తులో వచ్చే ప్రమాదాలను అంచనా వేయకుండా ఎప్పటికప్పుడు

ఎప్పటికయ్యది ప్రస్తుతం అన్నట్లుగా మనకు ఏది అవసరమో దాన్ని మాత్రం పాటిస్తూ తరవాత వస్తే లాభం ఏమిటి అని మనం ఆలోచించాలి. అప్పుడు మాత్రమే నిజమైన పరిష్కారాలు దొరుకుతాయి.

వ్యవసాయంలో ఎలుకల నిర్మూలనకు తన పొలంలో మాత్రమే ఒక రైతు పని చేస్తే ఆ ఎలుకల నిర్మూలన సాధ్యం కాదు. సామూహికంగా అందరి పొలాలలో ఎలుకల నిర్మూలనకు ప్రయత్నిస్తే తప్ప ఎలుకల నిర్మూలన జరగదు. ఈ ఉదాహరణ ప్రపంచానికి పర్యావరణానికి కూడా పనికి వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా బాగా శాస్త్ర సాంకేతిక విజ్ఞానాలను వాడుకుంటున్న అమెరికా, చైనా, రష్యా ,జపాన్,జర్మనీ, ఫ్రాన్స్ లాంటి దేశాలతో పాటు మన దేశం కూడా ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉండి మనం కూడా ప్రకృతి వినాశనానికి "తిలా పాపం తలపిడికడు" అన్నట్టు మన వంతు ఆజ్యం పోస్తున్నాము.

అందుకే ఎలుకల నిర్మూలనకు రైతులు ఎలా సామూహికంగా ప్రయత్నించాలో పర్యావరణ పరిరక్షణకు చిన్న పెద్ద దేశాలు అన్నీ కలిసికట్టుగా సమిష్టిగా కృషి చేసినప్పుడు మాత్రమే పర్యావరణ విధ్వంసం జరగదు ప్రకృతి ప్రకోపించదు.

ఇక మన తెలుగు రాష్ట్రాలలో వచ్చిన వరదల విషయంలో ప్రజలు వరదలో బురదలో అల్లాడిపోతూ ఎవరైనా రక్షించేవారున్నారా అంటూ హాహాకారాలు చేస్తుంటే వరద సమయంలో బురద రాజకీయాలు చేస్తున్న రాజకీయ పార్టీలను కూడా చూస్తున్నాం. మొదటిగా మొదలుపెట్టింది ఎవరు అంటే తమలపాకుతో ఒకరంటే తలుపు చెక్కతో మరొకరు జవాబు ఇస్తున్నారు. మధ్యన రాజకీయ (ఓట్ల)పోట్ల గిత్తల పోరాటంలో లేక దూడల లాగా మనం అమాయకంగా బలి అవుతున్నాము. దీనికి తోడు మనకు నచ్చిన రాజకీయ పార్టీ సిద్ధాంతాల సంగతి పక్కనపెట్టి కేవలం పార్టీ దుర్మార్గ రాజకీయాల క్రీడలో ప్రజల మధ్య వైషమ్యాలు పెంచడానికి మెయిన్ స్ట్రీమ్ మీడియాతో పాటు సోషల్ మీడియా కూడా ప్రజలలో భయాందోళనలు సృష్టిస్తున్నాయి. ప్రచారం చేయకూడని అంశాలను ప్రచారం చేస్తున్నాము. అలాగే ప్రకృతి వనరులను కేవలం రాజకీయ వ్యాపార వర్గాలే కాకుండా సామాన్య ప్రజలు కూడా తమ వంతు స్వార్థంతో ఎవరికి అందినంతవారు కబళిస్తున్నారు.

ఈ ప్రకృతి వినాశనం అరికట్టాలంటే ప్రకృతితో మమేకమై బతకడం నేర్చుకోవాలి. దానికి మన జీవన విధానాన్ని మార్చుకోవాలి. అలాగే పాలకులు తర తమ అనే బేధం లేకుండా ముందస్తుగా ప్రకృతి వినాశనాన్ని అరికట్టే విధంగా ప్రణాళికలు రూపొందించాలి.

అప్పుడు మాత్రమే ప్రకృతి ప్రకోపించకుండా ఉంటుంది. దీనికి "పిల్లి మెడలో ఎవరు గంట కట్టాలి"అంటే ప్రజాస్వామ్యంలో ప్రభువులమైన మనమే పాలకులను శాసించాలి. విధాన నిర్ణయాలలో మనం కూడా భాగస్వామ్యం కావాలి. ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవాలి. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ఒకటే సరిపోదు ప్రజల ఓటు వేసే నిర్ణయాధికారం మాత్రమే అంతకంటే సరిపోదు పాలనలో ప్రజల భాగస్వామ్యం తో పాటు చట్టబద్ధ పాలన స్వయం దిద్దుబాటు ఉన్నప్పుడు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ★

# ఆటగాళ్లు కాదు, ఆటనియమాలు మారాలి

దేశంలో కొన్ని కీలక రంగాలు బాగుపడుతున్నా, రాజకీయాలు మాత్రం దిగజారుతున్నాయని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు, కోట్లాది సామాన్య, దిగువ మధ్యతరగతి ప్రజల అభివృద్ధికి పెను ప్రమాదమని భీశెట్టి బాబ్జీ అన్నారు. ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో కోట్ల రూపాయల అక్రమ వ్యయం, ఎవరు ఎందుకు ఏ పార్టీలో ఉంటారో, ఎందుకు మారిపోతారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఉచితాలతో ప్రజలను రాజకీయ పార్టీలు ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నాయని మండిపడ్డారు. అక్టోబర్ 2న లోక్‌సత్తా పార్టీ 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా, పార్టీ జెండా ఎగురవేశారు. గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రిలకు నివాళులర్పించారు. లోక్‌సత్తా పార్టీని ప్రారంభించి దేశ రాజకీయాల్లో సరికొత్త సందేశాన్ని అందించిన జేపీ చెబుతున్నట్లు ఆటగాళ్లు మారితే చాలదు, ఆట నియమాలు మారాలన్నారు. ప్రజలు కూడా మంచి రాజకీయాల వైపు అడుగులు వెయ్యాలని, ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటం చెయ్యడానికి జేపీ వెంట లక్షలాది యువత ప్రత్యక్షంగా, పరోక్షంగా నిరంతరం పనిచేస్తున్నారన్నారు. రాజకీయం వేగంగా మారాలంటే దేశంలో దామాషా పద్ధతి ఎన్నికలు రావాలని, ఇందుకోసం జేపీ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగభూషణం, రాజారావు, పి.ఎల్.ఎన్ రాజు, సిమ్మ శ్రీను, రమేష్, లక్ష్మణరావు, చంద్రరావు, పౌర వేదిక ప్రతినిధులు రామచంద్రరాజు, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు హారిక స్ఫూర్తి




సవాళ్లను ఎదుర్కోవట, భిన్నంగా ఆలోచించటం, సమస్యల్ని పరిజ్ఞానంతో పరిష్కరించటం, సహనంతో వ్యవహరించటం, కొంత సమయం సమాజ సేవకు వెచ్చించటం ఆధునిక యువతకి ఉండాల్సిన ఈ లక్షణాలన్నీ ఆకళింపు చేసు కున్నారు హారిక.

నిజమైన విద్యకు నిర్వచనమైన ఈ లక్షణాలు ఆమెలో వికసించటానికి నాణ్యమైన విద్యా సంస్థల్లో చదువుతోపాటు తల్లిదండ్రుల దిశానిర్దేశం దోహదం చేశాయి.

'ఏ రంగాన్నయినా ఎంచుకో, కానీ ప్రతి రంగంలోనూ సవాళ్లుం టాయి' అన్న అమ్మానాన్నల మాటలు ఆమెకు భిన్నంగా ఆలోచించే సామర్థ్యాన్ని అందించాయి. సమాజహితాన్ని పట్టిం చుకునే ఇంజినీర్‌గా తీర్చిదిద్దాయి. స్వస్థలం నెల్లూరు అయినా, తండ్రి మోహన్ సివిల్ ఇంజినీర్ ఉద్యోగం రీత్యా హైదరాబాద్, బెంగళూరులో ఎక్కువగా ఉన్నారు. హైదరాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో చదువయ్యాక, బెంగళూరులో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చేసే సమయంలోనే రోటరీ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా పిల్లలతో కలిసి పనిచేయటం పట్ల ఆమెకు ఎంతో ఇష్టం. వాళ్లతో గడపాలంటే అవసరమైన శక్తి, సహనం తనకున్నాయని ఆమె సగర్వంగా చెబుతారు. ఈ క్రమంలో బెంగళూరులోని జనాగ్రహ స్వచ్ఛంద సంస్థలోని బాల జనాగ్రహలో, ఆ తర్వాత నిర్మాణ్ సంస్థలో కొన్నేళ్లపాటు పని చేశారు. అకడక్కడా పిల్లల హక్కులపై అవగాహన కల్పించేవారు. అదేవిధంగా ఢిల్లీలోని ఇండియా ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ స్కూళ్లకు సదుపాయాలు కల్పించే కృషిలో భాగమయ్యారు. అలా స్వచ్ఛంద సంస్థల్లో కలిసి పనిచేసే క్రమంలో చెన్నైలో వరదలు ముంచెత్తిన సమయంలో నటుడు సిద్ధార్థ్ ప్రారంభించిన మైక్రో సహాయ కార్యక్రమంలో వాలంటీర్‌గా సేవలందించారు. ఆ వరదల్లో ఎక్కడ కొట్టుకుపోతానోనని అమ్మవాళ్లు భయపడ్డారని, తనకు మాత్రం డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ఎలా నిబ్బరంగా ఉండాలో అర్థమైందని చెబుతారు. కొవిడ్ సమయంలో కర్ణాటకలో కెప్టెన్ మణివణ్ణన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎంపిక చేసుకున్న మాస్టర్ వలంటీర్ల బృందంలో తాను భాగమవటం గురించి వివరిస్తూ, 'మేమంతా కలిసి ప్రజలకు ఇబ్బంది రాకుం డా చూసుకున్నాం. ఆ సేవని ఆక్స్‌ఫర్డ్ ఒక కేస్‌స్టడీగా కూడా తీసుకుంది' అని తెలిపారు. ఆక్యుపంక్చర్ నేర్చుకోవటం గురించి చెబుతూ, "మా అమ్మకి మోకాళ్ల నొప్పులు ఎక్కువగా ఉండేవి. ఎన్ని ప్రయత్నాలు చేసినా తగ్గలేదు. చివరికి ఆక్యుపంక్చర్‌తో తగ్గింది. దాంతో నేనూ ఆసక్తికొద్దీ ఆక్యుపంక్చర్ చదివా. తీరిక ఉన్నప్పుడు బెంగళూరులో

ప్రాక్టీస్ చేస్తుంటా” అని చెప్పారు.

**ఇక హిమాలయన్ బైక్ రైడ్ గురించి హారిక మాటల్లోనే ..**

“కొవిడ్ సేవా కార్యక్రమాల్లో అబ్బాయిలే ఎక్కువగా ఉండేవారు. ఆ సమయంలో వాళ్లు నడిపే బైక్స్‌ని నేను సరదాగా నడుపుతూ ఉండేదాన్ని. అలా రకరకాల బైక్స్‌ని నడిపినా వ్యక్తిగతంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్ అంటే చాలా ఇష్టం. సౌకర్యవంతంగా ఉంటుంది. ఒంటరిగా, నా ఫ్రెండ్ రమ్యతో కలిసి చాలా రైడ్స్‌కి వెళ్లేదాన్ని. మా బైకర్స్ బృందానికి చెందిన ఓ ఫ్రెండ్ మాటల్లో ఉమ్లింగ్‌లా పాస్ గురించి విన్నా. అప్పట్నుంచీ అది నా బకెట్‌లిస్ట్‌లో ఓ లక్ష్యంగా చేరి పోయింది. రమ్య, నేనూ ఇద్దరం శ్రీనగర్ వెళ్లి అక్కడ నుంచి ఉమ్మింగ్‌లా వెళ్లాలనుకున్నాం. తను హెచ్‌ఆర్ కావడంతో ఉద్యోగ పనులతో వెనుతిరగాల్సి వచ్చింది. నేను కొనసాగించా. లెహ్ నుంచి బైక్‌పై నా యాత్ర మొదలయ్యింది. ఉమ్మింగ్‌లా వెళ్లాలంటే హాన్లే గ్రామం దాటుకుని వెళ్లాలి. అక్కడ ఇస్రో ఏర్పాటు చేసిన టెలిస్కోప్ ఉంటుంది. లైట్ పొల్యూషన్ ఉండదు కాబట్టి, చాలామంది నక్షత్రాలు చూడటానికి వస్తారు. అంత వరకూ సందడిగా ఉన్నా అక్కడి నుంచి నాది ఒంటరి ప్రయాణం. హాన్లేలో స్థానికులే ఆతిథ్యం ఇస్తారు. నూనెలేని తేలిక పాటి తుష్కా వంటి వంటకాలు పెడతారు. అవి తిని బయలు దేరాను. 19 వేల అడుగుల ఎత్తులో కదా, అక్కడ ఆక్సిజన్ ఉండదు. కాస్త శరీరం అలవాటు కావాలి. లేకపోతే ఉన్నట్లుండి కళ్లు తిరిగి పడిపోతాం. ఇరుకు రోడ్లు ఉంటాయి. తరచూ ఇసుక తుపాన్లూ వస్తుంటాయి. ఏ మాత్రం అదుపు తప్పినా లోయలో పడిపోతాం. అలా ఒక ఇసుక దుమారం నన్ను పలకరించింది. ఇసుక దెబ్బకి బైక్‌తో జారి పడ్డా. ఇక నా పని అయిపోయింది అనుకుని కళ్లు మూసుకున్నా. అందులో భాగంగా రోడ్ అంచుల వరకూ వెళ్లి ఆగింది బైక్ అక్కడ నుంచి జాగ్రత్తగా ఒంటరిగా ప్రయాణం సాగించా. ఉమ్మింగ్‌లా బోర్డు చూడగానే కళ్లలోంచి నీళ్లు వచ్చాయి. ఇంతలో నా ఎడమ అరచేయి మొద్దుబారింది. అదో పక్క బాధ. ఎక్కేటప్పుడు రెండో గేర్ కన్నా వేయలేం కాబట్టి నిదానంగా వెళతాం. కానీ దిగేటప్పుడు అలా కాదు. బ్రేక్స్ పట్టుకునే ఉండాలి. ఈ ప్రాంతపు బౌద్ధారామాలు ఎంతో బాగుం టాయి. ప్రశాంతంగా, అలాగే లద్దాఖ్ వంటి చోట్ల ఇంటిల్లిపాదికీ పెరట్లో సాగుచేసుకుంటారు. ఫార్మ్‌టు ప్లేట్ తరహాలో పెరట్లో పండించుకుని తాజాగా తింటారు. స్త్రీలు, పురుషులు సమానంగా కష్టడపపడతారు” అని తెలిపారు.






మా బైకర్స్ బృందానికి చెందిన ఓ ఫ్రెండ్ మాటల్లో ఉమ్లింగ్‌లా పాస్ గురించి విన్నా. అప్పట్నుంచీ అది నా బకెట్‌లిస్ట్‌లో ఓ లక్ష్యంగా చేరి పోయింది. రమ్య, నేనూ ఇద్దరం శ్రీనగర్ వెళ్లి అక్కడ నుంచి ఉమ్మింగ్‌లా వెళ్లాలనుకున్నాం. తను హెచ్‌ఆర్ కావడంతో ఉద్యోగ పనులతో వెనుతిరగాల్సి వచ్చింది. నేను కొనసాగించా.

హారిక ఇటీవల ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌ని కలిసి ఇంటర్వ్యూ చేశారు. https://www.youtube.com/JPLoksattaOfficial చూడండి.

★

# ఆయుష్మాన్ భారత్ విస్తరణ వల్ల ఏం లాభం?




ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై వేగంగా నిర్ణయం తీసుకుని అమలు చేసిన మోదీ ప్రభుత్వం మూడోసారి ఎన్నికల తర్వాత విధానాల అమలులో తరచూ యూటర్న్ తీసుకుంటోందన్న విమర్శలు, ఎద్దేవాలు వినిపిస్తున్నాయి. అంతకుముందు వ్యవసాయ చట్టాలపై మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గినా, దాన్నో మినహాయింపుగా మాత్రమే చూశారు. ఇప్పుడు ప్రమాణస్వీకారం చేసిన రోజుల వ్యవధిలోనే విధానాలపై మోదీ వెనక్కి తగ్గటానికి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపాల్సి రావటం ఒక కారణంగా భావిస్తున్నారు. కానీ విషయమేమంటే, మోదీ వెనక్కితగ్గిన అంశాలన్నీ దేశానికి మేలు చేసేవే. వ్యతిరేకుల వాదనల్లోని లోపాల్ని హేతుబద్ధంగా బయటపెట్టి వారిని, ప్రజలను ఒప్పించే విధంగా ప్రయత్నం చేయటంలో మోదీ విఫలమమైనట్లు కనిపిస్తుంది. అది మోదీ నాయకత్వ లోపమా, అదో రాజకీయ వ్యూహమని ఆయన భావిస్తున్నారా తెలియదు. కానీ రాజకీయానికి - అధికారానికి, అధి కారానికి - పరిపాలనకు మధ్య సంఘర్షణను సమన్వయం చేయలేకపోవటం వల్ల మంచి విధానాలు వెనక్కెళ్లి దేశం నష్టపోయిన మాట వాస్తవం. ఆ విషయం అలా ఉంచితే, ప్రతిపక్షాల నుంచి, సంకీర్ణం నుంచి ఎటువంటి సమస్యలూ లేని కొన్ని కీలక అంశాల్లో కూడా మోదీ సమగ్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించటం వల్ల కూడా దేశానికి నష్టం జరుగుతోంది. ఆర్థిక రంగంలోలా అసాధారణ స్థాయిలో మోదీ అక్కడేమీ రాజకీయ రిస్కు కూడా తీసుకోనక్కర్లేదు. కానీ ఆ పథకాల వల్ల ఆయనకు, ఆయన ప్రభుత్వానికి పేరు, ఓట్లు కూడా వస్తాయి. ఇందుకు ఒక ఉదాహరణ ఇటీవల ఆరోగ్య రంగంలో తీసుకున్న నిర్ణయం.

ఆరోగ్య రంగంలో ఓట్లు ఉన్నాయని మోదీ ప్రభుత్వం గుర్తించిన మాట వాస్తవం. అందులో భాగంగా ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఎ.బి పి.ఎం - జె.ఎ.వై)ను 2018లో తీసుకొచ్చింది. అయితే ఈ ఇన్సూరెన్స్ ఆధారిత పథకం ద్వారా పేద కుటుంబాలకు ఏటా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తోంది. అనేక పేద కుటుంబాలు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుంటున్నాయి. ఇదే పథకాన్ని ఇప్పుడు 70 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు కూడా వర్తింపచేస్తూ మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల 4.5 కోట్ల కుటుం బాల్లోని 6 కోట్ల మందికి లబ్ధి కలుగుతుందని అంచనా. ఇది ఎన్నికల హామీయే అయినప్పటికీ అమలు చేసే ముందు ఆయు ష్మాన్ భారత్ పథకాన్ని లోతుగా సమీక్షించి లోపాల్ని సరిదిద్దే ప్రయత్నం చేయకపోవటం వల్ల ఆశించిన ఫలితం దక్కే అవకాశం లేదు.

అంతకుముందు, ఇన్సూరెన్స్ పథకాల్ని వయసుతో సంబంధం లేకుండా వృద్ధులకు కూడా ఇవ్వాలని యూనియన్ ప్రభుత్వం ఇటీవల బీమా సంస్థలకు ఆదేశాలు ఇచ్చింది. ఇదేసమయంలో ఆరోగ్య బీమా పథకాలపై ఉన్న పన్నులను తగ్గించాలని జీఎస్టీని తగ్గించాలని ప్రతి పక్షాలతోపాటు సొంత పార్టీ నేతలు కూడా ప్రభుత్వాన్ని పార్లమెంటులో కోరారు. ఒకవేళ తప్పనిసరిగా పన్ను విధించాలంటే 5 శాతానికి పరిమితం చేయాలని కోరారు. ఈ చర్చ సందర్భంగానైనా ప్రభుత్వం ఆరోగ్య రంగంలో బీమా పాత్రపై లోతుగా చర్చించి ఆయుష్మాన్ భారత్‌పై చర్చించే ప్రయత్నం చేయలేదు.

అందరికీ నాణ్యమైన ఆరోగ్యం ఆర్థిక భారం లేకుండా అందించటం ప్రభుత్వ బాధ్యత అయినా, అనారోగ్య సమస్యలకు ప్రజలు సొంతంగా జేబుల్లో నుంచి చేస్తున్న ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో ఉంది. ఇందులో ఔట్‌పేషెంట్ (ఓ.పి) సేవలకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంది. సీనియర్ సిటిజన్లలో ఎక్కువమందికి అయ్యే వైద్య ఖర్చులు ఓ.పి సేవలకు సంబంధించి ఉంటాయి. ఈ వ్యయం వారి ఆరోగ్యం కోసం సొంతంగా చేస్తున్న ఖర్చులో 40-80 శాతం ఉంటుందని అంచనా. చిన్న వయసు నుంచి జీవనశైలి వ్యాధులు పెరుగుతుండటం, మరోవంక జీవితకాలం పెరగటంతో సీనియర్ సిటిజన్ల ఆరోగ్య ఖర్చు ఉన్నకొద్దీ పెరుగుతోంది. కానీ ఆయుష్మాన్ భారత్ ఔట్ పేషెంట్ సేవలందించే ప్రాథమిక ఆరోగ్యాన్ని అందివ్వదు. ద్వితీయ, తృతీయ స్థాయి ఆసుపత్రి వైద్యానికి మాత్రమే వర్తిస్తుంది. కానీ వ్యాధి ముదిరాక ఆసుపత్రుల్లో చేరటం వల్ల ఇన్సూరెన్స్ పథకం వల్ల వచ్చే ఫలితం పరిమితంగా ఉంటుంది. ఖర్చు మాత్రం భారీగా పెరిగిపోతుంటుంది. దీనివల్ల ఆయుష్మాన్‌భారత్ పథకం వృద్ధుల ఆరోగ్యం విషయంలో ఆశించిన ఫలితం ఇవ్వదు.

ఈ వైఫల్యం ఆ పథకం విషయంలో ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోంది. ఆ పథకంలో చెల్లింపులకు సంబంధించిన అభ్యంతరాల వల్ల ప్రయివేటు ఆసుపత్రులు ఆసక్తి చూప కపోవటం, కొన్ని ఆసుపత్రులు సేవల నుంచి వైదొ లగటం, ప్రభుత్వాసుపత్రుల మీద ఒత్తిడి విపరీతమవటం, అసలే అరకొరగా ఉన్న సదుపాయాలు ఇంకా అధ్వాన్నమవటం, కొన్ని రాష్ట్రాల్లో ఆ మేరకు కూడా ప్రభుత్వాసుపత్రులు తగినన్ని లేక పోవటం వంటి కారణాల వల్ల ఆయుష్మాన్ భారత్ వల్ల పేద ప్రజ లకు నాణ్యమైన, గౌరవప్రదమైన వైద్య సేవలుం అందటం లేదు. ఈ లోపాల వల్ల ఆయుష్మాన్ భారత్ పథకం ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు విస్తరించటం లేదు. ఈ నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్‌ని యధాతథంగా అమలు చేయటం వల్ల ప్రయోజనం పెద్దగా ఉండదని గుర్తించి ప్రభుత్వం తగిన మార్పులపై చర్చించాల్సింది.

ఈ రకంగా సరైన చర్చ, అవసరమైన దిద్దుబాటు లేకుండా

**ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కింద ఈ ఏడాది సెప్టెంబర్ 1 నాటికి 7.79 కోట్ల మందికి 1.07 లక్షల కోట్ల విలువైన వైద్య చికిత్సలు అందించినట్లు యూనియన్ వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఇప్పటివరకు 35.36 కోట్ల కార్డులు జారీ చేసినట్లు పేర్కొంది. ఈ పథకం ద్వారా అత్యధికంగా కాటరాక్ట్ శస్త్రచికిత్సలు జరిగినట్లు తెలిపింది. ఆ తర్వాత వరుస ప్రాధాన్యతా క్రమంలో రొమ్ము క్యాన్సర్, కరొనరి యాంజియోప్లాస్టీ, మూత్రనాళంలో రాళ్ల తొలగింపు, హైరిస్కు కాన్పులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, మోకీలు మార్పిడి చికిత్సలు, అపెండిక్స్ తొలగింపు, తుంటి మార్పిడి సర్జరీలు, తల శస్త్రచికిత్సలు, బైపాస్ సర్జరీలు, హార్ట్ వాల్వ్ సర్జరీలు, నోటి క్యాన్సర్, గాల్ బ్లాడర్ తొలగింపు సర్జరీలు, గ్రహణం మొర్రి సర్జరీలు జరిగాయి.**

పథకాన్ని విస్తరించటం వల్ల ఫలితాలు లేకపోగా, ఆయుష్మాన్ భారత్ ఇన్సూరెన్స్ ఆధారితం కావటం వల్ల ఖర్చు మాత్రం ఉన్న కొద్దీ పెరుగుతూంటుంది. ఇన్సూరెన్స్ ఆధారిత ఆరోగ్య పథ కాల వల్ల  అమెరికా వంటి సంపన్న దేశాలు కూడా సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. కాబట్టి బీమా ఆధారిత పద్ధతిలో ప్రభుత్వం నిధులు కేటాయించటం వల్ల ఖర్చు పెరుగుతూ ఫలితాలు మాత్రం తక్కువగా ఉంటాయి. అందులో భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి సమస్య మరీ ఎక్కువ. అందువల్ల ప్రజలకు కావలసిన అంశాల్లో  ఇది వమరీ ఎక్కువ సమస్య. ఇందులో ప్రజలకు కావలసిన అంశాల్లో ఎరా క్కుశంలో  నేపథ్యంలో ప్రజలకు ఆరోగ్యం అందించటం ప్రభుత్వం వల్ల సాధ్యమయ్యే పనికాదు అనే నిరాశాపూరిత వాతావరణం ప్రబలే ప్రమాదముంది. ఇప్పటికే ఈ రంగంలో డిమాండ్ దృష్ట్యా భారీ ప్రయివేటు రంగం వల్ల ఆరోగ్యాన్ని భారీ పెట్టుబడులు పెడుతున్న ప్రయివేటు రంగం ఆరోగ్యాన్ని ఖరీదైనదిగా మార్చటం వల్ల సామాన్య ప్రజలు మధ్యతరగతి స్థాయికి ఎదిగే ప్రక్రియ దెబ్బతింటుంది. అభివృద్ధి సమ్మిళిత శక్తి సన్నగిల్లుతుంది.

మరోవంక, దీర్ఘకాలిక వ్యాధులు ఇటీవల యువతలో కూడా వేగంగా పెరుగుతున్నాయి. వీటి నియంత్రణకు అవసరమైన ప్రాథమిక ఆరోగ్యం అధ్వాన్నంగా ఉండటం వల్ల ఔట్ పేషెంట్ సేవలు భారంగా మారటంతోపాటు, వ్యాధుల నియంత్రణ సమర్థంగా జరగటం లేదు. దీనివల్ల వారి ఉత్పాదక శక్తి తగ్గుతూ వ్యక్తిగత ఆదాయాలు, దేశ ఆర్థిక రంగం మూల్యం చెల్లిస్తున్నాయి. కాబట్టి ప్రాథమిక ఆరోగ్యాన్ని పటిష్ఠం చేసేలా ఆయుష్మాన్ భారత్‌లో తగిన మార్పులు చేయాల్సి ఉంది.

ఉన్నకొద్దీ ఆరోగ్యం ఖరీదవుతున్నందున ఆ ఇన్సూరెన్స్ ఆధారిత పద్ధతిలో ప్రభుత్వం నిధులు కేటాయించటం వల్ల ఆరోగ్య రంగంలో ప్రజలకు ఆరోగ్యం అందే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ప్రత్యామ్నాయంగా ప్రాథమిక స్థాయిలో ఔట్ పేషెంట్ ఆధారిత సేవలకు పటిష్ఠ ఏర్పాటు చేస్తూనే తృతీయ స్థాయి వైద్యం మీద అధునాతన వైద్యం పెరుగుతున్నకొద్దీ పెరుగుతున్న విపరీత భారం లేకుండా ఏర్పాట్లు చేయాలి. ఇందు కోసం ఆయుష్మాన్ భారత్‌ని ద్వితీయ స్థాయిలో కొనసాగిస్తూనే ప్రాథమిక, తృతీయ స్థాయి ఆరోగ్యానికి అదనపు ఏర్పాట్లు చేయాలి.

ద్వితీయ స్థాయిలో ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాల ద్వారా భర్తీ చేస్తూ, ప్రాథమిక, తృతీయ స్థాయిలో ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకోవాలి. వైద్యం, బయటి అంశాలైన డయాగ్నొస్టిక్స్ వంటివి ప్రయివేటు రంగానికి కేటాయించినా ప్రభుత్వమే అందుకు పూర్తి బాధ్యత తీసుకోవాలి.

ఈ క్రమంలో, ఇప్పటికే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, అదే పద్ధతిలో, అవే నిబంధనలతో కొనసాగించటం వల్ల పెద్దగా ఫలితం వచ్చే అవకాశం లేదు. అక్కడ జీతాలిచ్చి, డాక్టర్లను రప్పించటం, వారికి జీతాలిచ్చి పనిచేయించటం దాదాపు అసాధ్యమని చాలాచోట్ల ఫలితాలనివ్వదని ఇప్పటికే రుజువైంది. ఒకవేళ కాస్త సదుపాయాలున్నా, సిబ్బంది అందుబాటులో ఉన్నా ప్రజల్లో వాటి పట్ల విశ్వసనీయత లేదు. అందువల్ల ఏ కాస్త ఆరోగ్య సమస్య వచ్చినా వారు ప్రజలకు ప్రయివేటు ఆసుపత్రులకు, ప్రభుత్వంలో అయితే నగరాల్లోని పెద్దాస్పత్రులకు వెళ్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలవారికి రవాణా, బస వంటి ఖర్చులు కూడా కలిపితే ఖర్చు తడిసిమోపెడవుతోంది. వ్యాధి తీవ్రమైనదైతే చాలా సందర్భాల్లో అప్పుల బారిన పడాల్సి వస్తోంది. కాబట్టి ఇప్పుడున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వ్యవస్థకు భిన్నమైన, ప్రజల విశ్వసనీయతను చూరగొనగల వ్యవస్థను నిర్మించటం అవసరం. ప్రాథమిక వైద్యం అత్యంత సమర్థంగా, నాణ్యంగా, చిట్టచివరి పౌరునికి కూడా అందేలా వ్యవస్థ నిర్మాణం జరగాలి. ఇందుకోసం గ్రామాల మధ్య చిన్న పట్టణాలను గుర్తించి అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అక్కడ డాక్టర్ల మధ్య పోటీ ఉండేలా, నమ్మకం ఉన్న డాక్టర్‌ని రోగి ఎంచుకునేలా ఏర్పాటు ఉండాలి. ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యంతో కూడా సమన్వయం గావించుకోగలిగేలా వాటి నిర్మాణం ఉండాలి. ఈ నిర్మాణం వల్ల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుంది. ఇప్పుడు ఏ వృద్ధులకైతే ఆయుష్మాన్ భారత్‌ను విస్తరించారో వారికి పూర్తి స్థాయిలో లబ్ధి కలుగుతుంది. వృద్ధులకు విస్తరణకు ప్రభుత్వం రూ.3,437 కోట్లు కేటాయించింది. కానీ సీనియర్ సిటిజన్లలో ఆరోగ్య సమస్యల రీత్యా ఈ ఆర్థికభారం ఇంకా ఎక్కువగా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.  అదేవిధంగా మిగతా ఇన్సూరెన్స్ పథకాల్లా ప్రభుత్వ ఇన్సూరెన్స్‌పై జీఎస్‌టీ లేదు. దీనివల్ల ఆ డబ్బు కూడా ఇన్సూరెన్స్ కంపెనీలకే మళ్లీ ప్రయివేటు వర్గాలకు ఇంకా ఎక్కువ లబ్ధి కలిగే అవకాశముందని భావిస్తున్నారు.

కాబట్టి ఆయుష్మాన్ భారత్ ప్రజల పేరు మీద ఖర్చు తప్ప ప్రజలకు ఆరోగ్యం అందించని ఒక అసంపూర్ణ పథకంగా, క్రమంగా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ఇంకా అధ్వాన్నంగా మార్చకుండా ప్రభుత్వం వెంటనే మేలుకొని పటిష్ఠ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పునాదిగా సమగ్ర ఆరోగ్య విధానాన్ని రూపొందించి రాష్ట్రాలు కూడా అమలు చేసేలా చర్యలు తీసుకోవటం మాత్రమే పరిష్కారం. ★







హైకోర్టు న్యాయమూర్తుల జాతీయ సమావేశాన్ని ఎన్నికల చట్టంపై నిర్వహించారు. భోపాల్‌లోని జాతీయ జ్యుడీషియల్ అకాడమీలో జరిగిన సమావేశంలో మొదటి రోజు ‘ఎన్నికల నిధులు: పారదర్శకత, జవాబుదారీతనం, కోర్టుల పాత్ర’, రెండవ రోజు ‘ఎన్నికల సంఘం: పర్యవేక్షణ, నియంత్రణ పరిధి’ అంశాలపై చర్చలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు.



లోక్‌సత్తా పార్టీ వార్షికోత్సవం సందర్భంగా ఆ పార్టీ వ్యవస్థాకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌ను హైదరాబాద్‌లోని లోక్‌సత్తా కార్యాలయంలో ఆ పార్టీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నందిపేట రవీందర్, కార్యదర్శులు వంశీ ప్రసాద్, రంగాచారి, హైకోర్టు న్యాయవాది తీగలపల్లి రంగాచారి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# ‘ఆప్’ సైతం అదే బాటలో?

ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) వ్యవస్థాపకులు అరవింద్ కేజ్రీవాల్ మళ్లీ వార్తల్లోకి వచ్చారు. అయితే మీడియాలో ఎక్కువ ప్రచారమవుతున్న ఎన్నికల రాజకీయ వార్తల కంటే ఎక్కువ ప్రాధాన్యత గల అంశంలో.

లోక్‌సభ ఎన్నికల సమయంలో కేజ్రీవాల్‌ను మద్యం ముడుపుల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్టు చేసినప్పుడు, అది మోదీ ప్రభుత్వ వ్యూహాత్మక తప్పిదమని, దానివల్ల కేజ్రీవాల్‌కి ఎన్నికల్లో ప్రయోజనం చేకూర్చినట్లవుతుందన్న అంచనాలు వెలువడ్డాయి. ఆ తర్వాత ఆయన బెయిలుతో బయటికొచ్చి ప్రచారం చేశారు. అయితే ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసినా ఢిల్లీ ఫలితాలు బీజేపీకి అనుకూలంగా ఏకపక్షంగా వెలువడ్డాయి. కేజ్రీవాల్ అరెస్టు ప్రభావం పెద్దగా లేదని రుజువైంది. దీంతో ఆయన వ్యూహం మార్చారు. జైల్లో ఉండగానే తన బాధ్యతల నిర్వహణలో ప్రమోట్ చేస్తూ వచ్చిన ఆతిశీని ముఖ్యమంత్రిని చేశారు. ఇది కేజ్రీవాల్ తెలివైన వ్యూహమని, ఆమ్‌ఆద్మీ ఇమేజ్‌తో, స్వయంగా విస్తృత ప్రచారం చేసి ఢిల్లీలో తిరిగి గెలవటానికి, దేశ వ్యాప్తంగా కొన్ని రాష్ట్రాలలో పార్టీ విస్తరణకు దోహదం చేస్తుందని అంచనాలు వచ్చాయి.

కేజ్రీవాల్ అరెస్టుకు కారణమైన అవినీతి ఆరోపణలు అలా ఉంచితే, ఆయన రాజకీయ వ్యూహంలో తప్పులేదు. మీడియా ప్రచారం చేస్తున్నట్లు, అది వచ్చే ఎన్నికల్లో గెలవటానికి, కొన్ని రాష్ట్రాల్లోకి ఆప్ విస్తరించటానికి వ్యూహాత్మక అడుగై ఉండవచ్చు. అయితే ఎన్నికల లక్ష్యమైన మంచి పాలనకు సంబంధించి, ఆ పాలనకు దోహదం చేసే మంచి రాజకీయానికి సంబంధించి ఒక మౌలిక తప్పిదం కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార సమయంలో చోటుచేసుకుంది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఎంపిక కాగానే, ఆతిశీ చేసిన మొదటి ప్రకటన ‘ఢిల్లీకి ఒకే ఒక్క ముఖ్య మంత్రి. ఆయన అరవింద్ కేజ్రీవాల్. ఆయన్ను గెలిపించటమే నా ఏకైక లక్ష్యం’.

ఆ తర్వాత ప్రమాణ స్వీకారం చేశాక కూడా, అరవింద్ కేజ్రీవాల్ ఉపయోగించిన ఎర్రకుర్చీని ఖాళీగా పక్కనే ఉంచి, వేరే తెల్లకుర్చీలో ఆమె కూర్చున్నారు. ఆ ఎర్రకుర్చీ ఆయనదేనని, కేజ్రీవాల్ తిరిగి రావటం కోసం అది ఎదురుచూస్తోందని పేర్కొన్నారు. ఇక్కడ రామాయణాన్ని కూడా ఆమె ఉటంకించారు. అయోధ్య పీఠంపై శ్రీరాముడి



పాదుకల్ని ఉంచి తాత్కాలికంగా పాలించిన భరతుడి మాదిరిగా తాను వ్యవహరించనున్నట్లు తెలిపారు. శ్రీరాముడు 14 ఏళ్ల అరణ్యవాసానికి వెళ్లిన తర్వాత అయోధ్యను పాలించాల్సి వచ్చిన భరతుడిలా పాలిస్తానని, ఆనాడు భరతుడిది, ఇప్పుడు తనది ఒకే సరిస్థితి అని చెప్పారు. కేజ్రీవాల్‌ను రాముడితో పోలుస్తూ, తండ్రికిచ్చిన మాట కోసం అడవులకేగిన రాముడు నైతికతకు, హుందాతనానికి నిదర్శనమని, అదేవిధంగా కేజ్రీవాల్ దేశ రాజకీయాల్లో నిలుస్తారన్నారు. ఆయన అరెస్టు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చాక, ఇంకొకరైతే వెంటనే సీఎం పీఠంపై కూర్చునేవారని, కానీ కేజ్రీవాల్ రాజీనామా చేశారన్నారు.

ఈ తరహా రాజకీయం ఆప్ ఆవిర్భావ లక్ష్యాల్నే ప్రశ్నార్థకం చేయటం లేదూ? ముఖ్యమంత్రి ప్రాథమిక కర్తవ్యం ఏమిటి? ప్రజాప్రయోజనాలను పరిరక్షించటం. ముఖ్యమంత్రి ఎవరికి జవాబుదారీగా ఉండాలి? ప్రజలకు. అంతేగానీ, కేజ్రీవాల్‌కో, మరో నాయకుడికో కాదు. ముఖ్యమంత్రిగా తన పేరు ఖరారైన వెంటనే, ఢిల్లీ ప్రజల ఎదుర్కొంటున్న వర్షాలు, వరద నీరు, కాలుష్యం, ట్రాఫిక్ మొదలైన సమస్యల మీద, వాటికి తక్షణ పరిష్కార చర్యల మీద ఆతిశీ స్పందించాల్సి ఉంది. కానీ కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి చేయటమే తన ఏకైక లక్ష్యమని ప్రకటించటంతోపాటు, తాను కేజ్రీవాల్ ప్రతినిధినన్నట్లు, ఆయన ఉపయోగించిన కుర్చీని ఖాళీగా ఉంచారు. రామాయణాన్ని ఉటంకించి శ్రీరాముడి తరపున పాదుకలతో రాజ్య బాధ్యతలు నిర్వహించిన భరతుడితో తాను పోల్చుకోవటం ద్వారా ఇది ప్రజాస్వామ్యం కాదు, రాచరికం అన్నట్లు వ్యవహరించారు.

సంక్షోభ సమయంలో పార్టీలు నాయకుడి చుట్టూ అందులోనూ వ్యవస్థాపకుడి చుట్టూ తిరగటాన్ని సాధారణమే. అయితే ప్రజాప్రయోజనాలకి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా నాయకుడి చుట్టూ తిరగటం ద్వారా దాన్నో వ్యవస్థీకృత సంక్షోభంగా మార్చారు.

ఆతిశీ బ్రిటన్‌లో ఉన్నత విద్యను అభ్యసించి వచ్చారు. అక్కడ రాజకీయ పార్టీలు ఎలా పనిచేస్తాయి? ప్రజల నుంచి నాయకత్వం ఎదిగేలా పార్టీల నిర్మాణం ఉంటుంది. ఇందుకోసం పార్టీల్లో పటిష్ఠ అంతర్గత ప్రజాస్వామ్యం ఉంటుంది. పార్టీలు ఎన్నికల అభ్యర్థులను ఎంపిక చేసేటప్పుడు సభ్యుల అభిప్రాయాల్ని, తీసుకుని అందుకు అనుగుణంగా ఖరారు చేస్తారు. అలా ఉండబట్టే భారతీయ మూలాలున్న రిషీ సునాక్ సహా పలువురు ఎవరి అండాలేకున్నా ప్రధాని స్థాయికి వేగంగా ఎదగగలిగారు. ఈ విషయాలన్నీ అవగాహన ఉన్నప్పటికీ, ఆప్ నాయకత్వంలో అనేకమంది విద్యావంతులు అయినప్పటికీ, అభిప్రాయ భేదాలు సహజమనే స్పష్టత ఉన్నప్పటికీ, కేజ్రీవాల్ కాకుండా, ప్రజలు తన తొలి ప్రాధాన్యత అని చెప్పే సాహసం ఆమె చేయలేకపోయారు. ఒకవేళ అలా చెబితే తాను కేజ్రీవాల్ నాయకత్వాన్ని సవాలు చేసినట్లవుతుందని భావించి ఉండవచ్చు. అందువల్ల తన ప్రజాజీవిత లక్ష్యాన్ని మరచిపోయి మరీ కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి చేయటమే తన లక్ష్యమని ప్రకటించారు. ఎన్నికలు కొన్ని నెలల వ్యవధిలో జరగనున్నాయనే కారణంగా ఆతిశీ ఈ విధంగా వ్యవహరించి ఉండవచ్చు అనుకోవటం హేతుబద్ధతకి ఏమాత్రం నిలబడదు.

ఇప్పటికే ఇలాంటి రాజకీయానికి పాతుకుపోయిన పలు సాంప్రదాయ పార్టీలు పాల్పడుతున్నాయి. వంశపారంపర్య రాజకీయాలు, రాచరిక, పెత్తందారీ రాజకీయ సంస్కృతి, ప్రజలకు కాకుండా నాయకులకు విధేయత పాటించటం వంటివి చాలా పార్టీల రాజకీయంగా మారింది. కాంగ్రెస్ నుంచి ఈ జాడ్యాలు చాలా పార్టీలకు పాకాయి. కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయంగా వచ్చిన బీజేపీలో వంశపారంపర్య రాజకీయాలు ఒక స్థాయి దాటి లేకున్నా, వ్యక్తి ఆరాధన మాత్రం కాంగ్రెస్ స్థాయికి చేరుకుంటోంది. ఈ పరిస్థితిలో ఆప్ కూడా ఆ పార్టీల తరహాలోనే వ్యవహరిస్తోంది. తొలినాళ్లలో సాంప్రదాయ పార్టీలకు కొంత భిన్నంగా వ్యవహరించిన ఆప్, ఇప్పుడు వ్యక్తి ఆరాధన సంస్కృతిలో ఆ పార్టీలనే మించిపోతోందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యమంత్రి సీటు పక్కన గత ముఖ్యమంత్రి ఉపయోగించిన కుర్చీని ఖాళీగా వదిలేసి రాజభక్తిని చాటుకోవటం బహుశా ఏ సాంప్రదాయ పార్టీ చేయలేదేమో! ఆప్ ఆవిర్భావాన్ని చూస్తే, ఆ పార్టీకి, మిగిలిన పార్టీలకు తేడా ఎందుకు ఉండాలో అర్థమవుతుంది. అవినీతి వ్యతిరేక పోరాటంతో యువతలో ఆశల్ని రేపి కొత్త రాజకీయం పేరుతో ఆప్ ప్రారంభమైంది. ఢిల్లీలో ఆ ఉద్యమం జరగటం, ఆ ప్రాంతంలో దేశంలోని అన్ని ప్రాంతాలవారూ ఉండటం, తలసరి ఆదాయం గణనీయంగా ఎక్కువ కావటం మొదలైన కారణాల వల్ల అక్కడ ఆప్ అధికారంలోకి రాగలిగింది. అవినీతి వ్యతిరేక పాలనలో భాగంగా కొత్తవారికి, సమర్థులకి అవకాశాలిచ్చారు. లోక్‌సత్తా భావజాల స్ఫూర్తితో ఆప్ ఆవిర్భవించింది. కానీ ప్రజలకు సాధికారత అందించటానికి లోక్‌సత్తా తరహాలో సమగ్ర పరిష్కారాల్ని, వ్యవస్థల నిర్మాణాన్ని ఆలోచించకుండా, అధికారాన్ని మార్గంగా కంటే లక్ష్యంగా భావించటం వల్ల, ఇప్పుడు ఆప్ ఆవిర్భావ లక్ష్యమే ప్రశ్నార్థకమైంది.

దీనికితోడు, ఢిల్లీలో అధికారంలోకి వచ్చాక తర్వాతి ఎన్నికల్లో గెలవటం కోసం భారీ స్థాయిలో తాత్కాలిక వ్యక్తిగత పథకాలను, కొంత అభివృద్ధి ఎజెండాను మిళితం చేసి ఎన్నికల ఫార్ములాగా మార్చారు. మిగిలిన రాష్ట్రాల్లోనూ ఈ తరహా ఎన్నికల ఫార్ములాను అనుకరించే రాజకీయం పెరుగుతూండటం, వ్యక్తి ఆరాధన పట్ల భారతీయుల్లో ఉన్న సాంప్రదాయ ధోరణుల్ని మీడియా అండతో ఇంకా పెంపొందించుకోవటం ద్వారా ఢిల్లీలో తనకున్న రాజకీయ అవకాశాన్ని మిగతా చోట్ల విస్తరించే ప్రయత్నం చేశారు. ఢిల్లీలో తనకున్న రాజకీయావకాశాన్ని మిగతాచోట్ల కొత్త రాజకీయాన్ని పాదుకొల్పేందుకు వినియోగించకుండా, ఢిల్లీ తరహా లోపభూయిష్ట ఎన్నికల ఫార్ములాకు అదనంగా ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల ఖర్చులోనూ సాంప్రదాయ రాజకీయ పార్టీల తీరులోనే కేజ్రీవాల్ వ్యవహరించారు.

గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఏ పెద్ద పార్టీకీ తీసిపోని రీతిలో ఖర్చు పెట్టిందని చెబుతున్నారు. ఈ డబ్బులో చాలాభాగం ఓట్ల కొనుగోలుకు వినియోగించినట్లు ఆరోపణలున్నాయి. మద్యం ముడుపుల కేసును ఈ నేపథ్యంలోనే చూడాలని, ఇందులో కేజ్రీవాల్ పాత్ర ఉందనటానికి బలమైన ప్రాథమిక ఆధారాలున్నాయని తటస్థుల్లో సైతం పలువురు భావిస్తున్నారు. అయితే ఆ వాదనల్ని కేజ్రీవాల్ తోసిపుచ్చుతున్నారు. తన మీద ఎవరూ వ్యక్తిగత అవినీతి ఆరోపణలు చేయలేరని, తాను కోరుకుని ఉంటే మూడు వేల కోట్ల రూపాయలు తన జేబులోకి వచ్చి ఉండేవని బెయిలుపై విడుదలయ్యాక ఆయన అన్నారు. కేజ్రీవాల్ వ్యక్తిగతంగా అవినీతిపరుడని ఎవరూ అనకపోవచ్చు, ఆ లెక్కన మోదీ, ఈ దేశంలో ఇంకా అనేకమంది నేతలపై కూడా ఎవరూ అలాంటి ఆరోపణలు

చేయలేరు. ప్రతి పార్టీలో అలాంటి నిజాయతీపరులున్నారు. కానీ, అందరూ శాకాహారులే, బుట్టలో రొయ్యలు మాత్రం మాయమవుతున్నాయి. ఎన్నికల్లో కోట్ల రూపాయలు అక్రమంగా ఖర్చవుతూ, ఆ డబ్బును పోగేసుకోవటం కోసం లక్షల కోట్ల రాజకీయ అవినీతి జరుగుతోంది. ప్రజల డబ్బు లూటీ అవుతోంది.

ఢిల్లీలో అవినీతి వ్యతిరేక ఉద్యమం, ఆప్ అధికారంలోకి రావటంలో కీలక పాత్ర పోషించిన అన్నా హజారే, కేజ్రీవాల్, ఆప్ ఇతర సభ్యులు ఇప్పటికీ గాంధీ టోపీ ధరిస్తారు. కానీ రాజకీయం, అధికారం – రెంటికీ గాంధీజీ నిర్వచనం ఏమిటి? రాజకీయానికి సూత్రబద్ధత, అధికారానికి లక్ష్యం ఉండాలి అని. కానీ ఆప్ అందుకు విరుద్ధంగా రాజకీయానికి సూత్రబద్ధత అక్కర్లేదు, ఎలాగోలా అధికారంలోకి రావటమే లక్ష్యం అన్నట్లు వ్యవహరించటం లేదూ? అధికారానికి లక్ష్యం గురించి కన్నా, మళ్లీ అధికారంలోకి రావటమే లక్ష్యంగా వ్యవహరించటం లేదూ? అదేవిధంగా, నిజమైన స్వతంత్ర భారతంలో ఆమ్ఆద్మీకి ఏం చేయాలో గాంధీజీ చాలా స్పష్టంగా వివరించారు. "ఒక పని చేయాలా, వద్దా అని ప్రజాజీవనంలో ఉన్నవారికి ఎప్పుడైనా సందేహం వస్తే, మారుమూలున్న అత్యంత, పేద బలహీనమైన వ్యక్తి గురించి ఒక్క క్షణం ఆలోచించండి. మీరు చేసే పని వల్ల ఆ వ్యక్తి తన కాళ్ల మీద తాను నిలబడగలుగుతాడా? అతనికి తన జీవితం మీద తనకు పట్టువస్తుందా? అంటే, అతని సంపాదనా శక్తి పెరుగుతుందా? అలా పెరిగేట్లయితే అది అతనికి నిజమైన స్వరాజ్యం. అతడి ఆత్మవిశ్వాసాన్ని, శక్తిని పెంచ గలిగి నట్లయితే అది నువ్వు చేయదగిన పని, లేకపోతే నిరర్థకమైన పని" అని ఒక ప్రమాణాన్ని నిర్దేశించారు. ఇందులో ఎవరి కాళ్ల మీద వాళ్లు నిలబడేట్లు చేయటం కోసం ఆప్ ప్రభుత్వం నాణ్యమైన విద్య, ఆరోగ్యం మీద దృష్టి సారించటం హర్షించదగ్గ విషయం. కానీ అదే సమయంలో మిగతా వనరుల్ని దుబారా చేస్తూ తాత్కాలిక వ్యక్తిగత పథకాల్ని మితిమీరి ఇవ్వటం వల్ల ఆర్థిక భవిష్యత్తుకి ఎంత ప్రమాదమో ఆలోచన చేయలేదు. ఇవాళ ఎటువంటి డబ్బులూ జమ చేయకుండా, భవిష్యత్తు తరాల మీద నిరంతరం

**నిజమైన స్వతంత్ర భారతంలో ఆమ్ఆద్మీకి ఏం చేయాలో గాంధీజీ చాలా స్పష్టంగా వివరించారు. "ఒక పని చేయాలా, వద్దా అని ప్రజాజీవనంలో ఉన్నవారికి ఎప్పుడైనా సందేహం వస్తే, మారుమూలున్న అత్యంత, పేద బలహీనమైన వ్యక్తి గురించి ఒక్క క్షణం ఆలోచించండి. మీరు చేసే పని వల్ల ఆ వ్యక్తి తన కాళ్ల మీద తాను నిలబడగలుగుతాడా? అతనికి తన జీవితం మీద తనకు పట్టువస్తుందా? అంటే, అతని సంపాదనా శక్తి పెరుగుతుందా? అలా పెరిగేట్లయితే అది అతనికి నిజమైన స్వరాజ్యం. అతడి ఆత్మవిశ్వాసాన్ని, శక్తిని పెంచ గలిగి నట్లయితే అది నువ్వు చేయదగిన పని, లేకపోతే నిరర్థకమైన పని" అని ఒక ప్రమాణాన్ని నిర్దేశించారు.**

పెరుగుతుండే అన్యాయమైన, మోయలేని భారం మోపే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) తీసుకురావాలనటం ఎంత బాధ్యతారాహిత్యం!

ఆర్థిక వ్యవస్తను దెబ్బతీసే విధానాలను అవలంబించకుండా, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించాల్సిన అవసరం ఉంది. ఢిల్లీ సంపన్న రాష్ట్రం కాబట్టి ఆప్ ఫార్ములా అక్కడ తక్షణ ప్రభావం పెద్దగా కనిపించక పోయినా, ఢిల్లీ ఆర్థిక వనరులు, పరిస్థితులను, తమ వనరులను బేరీజు వేసుకోకుండా ఆ ఫార్ములాను అను కరించి చాలా రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయాయి. అంతెందుకు, ఆప్ అధికారంలో ఉన్న ఢిల్లీ పొరుగు రాష్ట్రం పంజాబ్ పరిస్థితినే చూడండి. అసలే ఆర్థిక సంక్షోభంలో ఉన్న పంజాబ్ ఆప్ హామీల అమలుతో మరింత కుంగి పోయింది. కాబట్టి గాంధీ విధానాల్ని విస్మరించి జాతీయోద్యమ అవసరాలరీత్యా గాంధీ ఉపయో గించిన టోపీల్ని ధరించటం వల్ల ప్రయోజనమేంటి? మన దేశం సహా ప్రపంచమంతా నిరూపితమైన అభివృద్ధి సూత్రాలను విస్మరించటం వల్ల ఆప్ ఎలాంటి ప్రత్యామ్నాయ రాజకీయం చేయాలనుకుంటోంది? మూలాల్లోకి వెళ్లి ఆప్ పునస్సమీక్షించుకోవాల్సిన సమయం. ★

## ప్రజాసమస్యల పరిష్కారానికి సిటిజన్స్ ఫోరం

తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పలువురు విశ్రాంత ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు, వ్యాపారులతో కలిసి 'తెలంగాణ సిటిజన్స్ ఫోరం' ఏర్పాటు చేసినట్లు విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.కె సింగ్ ప్రకటించారు. రాష్ట్రంలో కొంతకాలంగా పరిపాలన సక్రమంగా సాగటం లేదన్నారు. ప్రజలు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు పారదర్శకమైన సేవలు అందేలా ఫోరం పని చేస్తుందన్నారు. 16 మందితో ఫోరం ప్రతినిధి మండలిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీరిలో విద్యావేత్త చుక్కా రామయ్య, గోపీనాథ్, నాగిరెడ్డి, గ్లోబల్ ఆసుపత్రి ఛైర్మన్ డా. రవీంద్రనాథ్ తదితరులు ఉన్నారన్నారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉండటమే ఫోరం లక్ష్యమని తెలిపారు.

# ప్రజావాణి - ప్రజావేదిక - అసలు సమస్య

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల గ్రామసభల నిర్వహణలో ప్రపంచ రికార్డు సృష్టించారు. వంద రోజుల్లో 13,326 గ్రామాల్లో సభలు నిర్వహించారు. గ్రామ పాలనలో ప్రజల భాగస్వామ్యానికి గ్రామసభలు ఎంతో అవసరమనటంలో సందేహం లేదు. గ్రామసభలు విధిగా జరపాలని నిబంధనలు ఉన్నప్పటికీ చాలా గ్రామాలలో వాటిని మొక్కుబడిగా మాత్రమే



నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఎంతో ఆసక్తితో చొరవ చూపి నిర్వహించిన గ్రామసభలు ప్రజల భాగస్వామ్యానికి సంబంధించి ఏ మేరకు సత్ఫలితాల నిస్తాయో వేచిచూడాలిగానీ, గ్రామాల స్థితిగతులను మార్చాలనే సంకల్పం ఉన్నందుకు ఆయన్ను అభినం దించాలి. పనిగట్టుకుని పంచాయతీరాజ్ శాఖను తీసుకున్న పవన్ కళ్యాణ్ ఆ బాధ్యతలు స్వీకరించిన దగ్గర్నుంచి సమస్యల మీద దృష్టి సారించారు. గ్రామ సభల్లో యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే గ్రామాలకు వెళ్లాల్సిన నిధుల పరిస్థితిని ముందుగా సమీక్షించి, ప్రజల దృష్టికి తెచ్చారు. అంతకు ముందున్న వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో గ్రామాలకు జాతీయ స్థాయి నుండి వచ్చిన నిధుల్ని పక్కదోవ పట్టించారని సవివరంగా తెలిపారు. అధికారంలోకి రాకముందు రోడ్లు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో ప్రజలకు తెలియచేస్తూ పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించిన పవన్, ఆ అంశాన్ని వివరిస్తూ కనీసం రోడ్లు బాగు చేయటానికి కూడా డబ్బుల్లేవన్నారు. మంచినీటికి సంబంధించి మ్యాచింగ్ గ్రాంట్లు కూడా విడుదల చేయకుండా నిధులు దుర్వినియోగం చేశారని తెలిపారు. ఈ క్రమంలో గ్రామసభలు నిర్వహించటంతోపాటు సుమారు 400 పంచాయతీలకు లక్ష రూపాయల చొప్పున నాలుగు కోట్లు సొంత డబ్బును అందచేశారు. ప్రజల కోసం ఉదారంగా వ్యక్తిగత డబ్బు ఇవ్వటం ఆయన ఉదారతకు చిహ్నం. అయితే మిగిలిన 12,926 పంచాయతీల సంగతేంటి? గ్రామీణాభివృద్ధికి సంపన్నులు, వనరులున్నవారు, ఎన్నారైలు ఉదారంగా విరాళాలివ్వటం అవసరం. కానీ మౌలికంగా గ్రామీణాభివృద్ధికి అవసరమైన వనరులకు అది మూలం కాకూడదు. కానీ అది అదనమేగానీ, గ్రామీణాభివృద్ధికి విధిగా కేటాయించాల్సిన వనరులకు అవి ప్రత్యామ్నాయం కాదు.

అదేవిధంగా, తెలంగాణలో ప్రజావాణి కార్యక్రమం. ఎన్నికల్లో అంతకుముందున్న బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని చాలామేర సమతూకంతో అందించినప్పటికీ గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించటానికి కేసీఆర్ ప్రజలకు అందుబాటులో లేరు, ప్రజల సమస్యలు చెప్పటానికి వస్తే ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వటం లేదు అనే అభిప్రాయం కూడా ఒక ప్రధాన కారణం. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు పూర్తి విరుద్ధంగా ప్రజల్లో ఉండటానికి ప్రాధాన్యమిచ్చారు. ఈ దిశగా ఆయన ప్రభుత్వం పలు కార్యక్రమాలను రూపొందించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ నివాసమున్న ప్రగతి భవన్‌కు కంచెలు తొలగించి, ప్రజావాణి కార్యక్రమాన్ని అమలు చేసింది. ప్రగతి భవన్‌ని ప్రజలెవ్వరూ రాకుండా కేసీఆర్ రాచరికపు ధోరణితో వ్యవహరించారని, ఇప్పుడు ప్రజలు నేరుగా తమ సమస్యలపై రాష్ట్రం నలుమూలల్నుంచి ప్రగతి భవన్‌కు వచ్చి వినతిపత్రాలు ఇవ్వొచ్చని రేవంత్ ప్రకటించారు. ప్రగతి భవన్ పేరును ప్రజా భవన్‌గా మార్చారు. అనేకమంది వినతిపత్రాలతో ప్రజా భవన్‌కి తరలివచ్చారు. ముఖ్యమంత్రి స్వయంగా వినతిపత్రాలు తీసుకున్నారు. ప్రజల గోడును ప్రత్యక్షంగా విన్నారు. దీంతో వినతిపత్రం ఇవ్వటానికి జిల్లాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. కొందరు ముందురోజే బయలుదేరి వచ్చి తెల్లవారుజాము నుంచే వేచిచూసేవారు. ముఖ్యమంత్రితో స్వయంగా సమస్యలు చెప్పుకునే అవకాశం ఉండటంతో ఎన్నో ఆశలతో ప్రజలు వచ్చేవారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణను కూడా ఒక హామీగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వటంతో, ప్రజావాణి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని



పౌర సమాజ నేతలు పలువురు ప్రశంసలు కురిపించారు. మీడియా భారీ ప్రచారాన్నిచ్చింది. ఆ తర్వాత ప్రతి మంగళ, శుక్రవారాల్లో జరిగే కార్యక్రమాలలో ముఖ్యమంత్రి స్వయంగా అందుబాటులో ఉంటారని ప్రకటించారు. మిగిలిన రోజుల్లో కొందరు మంత్రులు విజ్ఞాపన పత్రాలు తీసుకున్నారు. క్రమంగా ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కూడా అందుబాటులో ఉండటం ఆపేశారు. అధికారులు దరఖాస్తులు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ప్రజావాణి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రజావాణిని వారానికి రెండు రోజులకు కుదించారు. కొంతమేర దరఖాస్తులు ఇచ్చే ప్రక్రియను జిల్లాలకు బదిలీ చేసినట్లు చెబుతున్నారు. వీటన్నిటి కారణంగా, ప్రజలు కూడా రావటం తగ్గించారు. తీసుకున్న అర్జీలపై పరిష్కారం కూడా అరకొరగా ఉంటోందని పలువురు ఫిర్యాదుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదు చేస్తున్నారు. సెప్టెంబర్ చివరి శుక్రవారం రోజు ఫిర్యాదుల వివరాలను మీడియాకు విడుదల చేశారు. ఆరోజు మొత్తం 365 అర్జీలు రాగా, కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి ఇన్‌చార్జి పరిష్కరించారు. ఇలా 63 ఫిర్యాదులను పరిష్కరించామని, మిగతావాటిని పోర్టల్ ద్వారా సంబంధిత అధికారులకు పంపామని తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఇంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి గట్టిగా ఆదేశాలిచ్చినా కార్యక్రమం ఇలా ఎందుకు నామమాత్రమైందని అడిగితే, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం అంత తేలిగ్గా జరగటం లేదని అధికారులు చెబుతున్నారు.

దీనర్థం, ఎవరి వల్ల ప్రజలకు ఆ సమస్యలు తలెత్తాయో తిరిగి వారి వద్దకే పరిష్కారానికి వెళ్లి యథావిధిగా జాప్యం జరుగుతోంది. ప్రజలకు సేవలందించాల్సిన పాలనా యంత్రాంగంలో ఉన్న లోపాన్ని సరిచేయకుండా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పేరుతో ప్రచారం తప్ప పరిష్కారం పెద్దగాలేని రీతిలో కార్యక్రమాన్ని అమలు చేశారు. అదేవిధంగా, ప్రధానమంత్రి చెప్పినా, ముఖ్యమంత్రి చెప్పినా స్థానిక సమస్యలకు పరిష్కారం స్థానికంగానే జరగటం వల్ల ఎక్కువ ఫలితాలు వస్తాయి. వారు ఎంత నిజాయతీపరులైనా స్థానికంగా ఉండే సాధకబాధకాలు అంత స్పష్టంగా తెలియవు. గ్రామ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన సమర్థులైన నాయకులు కూడా అలా స్థానిక సమస్యల పరిష్కారంలో విజయం సాధించలేకపోయారు. ఎంత సంకల్పం ఉన్నా కూడా స్థానిక సమస్య పరిష్కారంలో ఏదైనా సమస్య వస్తే పీఎం, సీఎం ఎంతవరకు పర్యవేక్షించగలరు? ముఖ్యమంత్రికి తప్ప పెద్ద అధికారంలేని మంత్రులకు ఈ కార్యక్రమంలో అధికారం ఉందనుకున్నా ఒక పరిధి దాటాక వారు కూడా ఏమీ చేయలేరు. దీంతో ప్రజాదరణ పలుచబడింది. వ్యక్తిగత, తాత్కాలిక పథకాల్ని, రుణమాఫీని అమలు చేయటానికే అప్పులు అందక సతమతమవుతున్న తెలంగాణ ప్రభుత్వం పాలనను ప్రక్షాళన చేయటం కన్నా ప్రచారానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ప్రజావాణిని విస్మరించింది. నిజానికి ప్రజావాణిని ప్రభుత్వం సీరియస్‌గా కొనసాగించి ఉంటే అసలు లోపం అర్థమయ్యేది. పాలనా వ్యవస్థను సరిదిద్దే గొప్ప అవకాశంగా ఈ కార్యక్రమం పరిణమించేది. అయితే పాలనను చక్కదిద్ది ప్రభుత్వానికి ప్రజలకు పరిష్కారాల్ని అందించటానికి చాలా ఓపిక కావాలి. ప్రభుత్వానికి మొదట్లో వచ్చిన సంచలన ప్రచారం రాదు. అధికారాన్ని దిగువస్థాయి వరకు తీసుకెళ్లి ప్రజలకు, ప్రభుత్వానికి నిజమైన అంతరం లేకుండా అందించేందుకు సంస్థాగత ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఇది చాలా బోరింగ్ కార్యక్రమంలా ఉంటుంది. కానీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే, ఫలితాలు మొదలై పౌరులు కేంద్రంగా పాలనా యంత్రాంగం పనిచేయటం మొదలయ్యేది. ప్రజల్లో ప్రభుత్వం, అధికార పార్టీ పట్ల ఎంతో సానుకూల మార్పు వచ్చేది. పనిగట్టుకుని ప్రచారం కూడా చేయాల్సిన అవసరం ఉండేది కాదు. పార్టీకి ఇప్పుడున్న పునాది మరింత బలపడేది. ఆ తర్వాతి ఎన్నికల్లో కూడా ఆ ప్రభావం కనబడి ప్రజాస్వామ్యం పటిష్ఠమయ్యేది. ఓటుకు, తమ జీవితానికి మధ్య సంబంధమేంటో ప్రజలకు అర్థమై మెరుగైన ప్రజాస్వామ్యం ఓటు వేయటం వల్ల పార్టీలు, నాయకుల మీద కూడా ఆర్థిక భారం భారీగా తగ్గేది. సంచలన ప్రచారాల కోసం ప్రభుత్వం ఎంచుకున్న ఇతర అంశాల్లో కన్నా సుస్థిర ప్రభావం చూపే ప్రచారం ప్రభుత్వానికి లభించేది. అక్రమ కట్టడాల కూల్చివేతకు ప్రభుత్వం ప్రారంభించిన హైడ్రా కార్యక్రమానికి ప్రజల్లో సానుకూల స్పందన వచ్చింది. అయితే హడావుడిగా ఈ

కార్యక్రమాన్ని అమలు చేయటం వల్ల ఆ ప్రభావం ఎంతకాలం ఉంటుందో చెప్పలేం. కానీ ప్రభుత్వానికి ప్రజావాణి లాంటి కార్యక్రమాల పట్ల లోతైన అవగాహనతో వ్యవహరించి సమస్యల్ని సమగ్రంగా పరిష్కరించే సంస్థాగత ఏర్పాట్ల మీద దృష్టి పెట్టి ఉంటే, హైడ్రా తరహా హడావుడి లేకుండా అమలు చేసే అవకాశం ఉండేది. గాంధీ పేరు తగిలించుకున్న నాయకుల నేతృత్వంలో సాగుతూ పేటెంట్ తరహాలో ఆయన పేరుని ఉపయోగించుకునే పార్టీ సామాన్య, పేద, మధ్యతరగతికి సేవలందించటానికి, అధికారాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లకుండా పైస్థాయిలోనే కేంద్రీకరించింది. ప్రచారంగా మార్చేసింది. రేవంత్‌రెడ్డి ప్రజల నుంచి ఎదిగిన మాస్ లీడరని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తారని ప్రచారం చేసిన పౌర సమాజ నేతలు కూడా ప్రజావాణి పేరుతో ప్రహసనాన్ని చూసి డంగైపోయారు.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ తరహా కార్యక్రమాన్ని ప్రజావేదిక పేరుతో రాష్ట్ర స్థాయిలో కేంద్రీకృతంగా జూన్‌లో ప్రారంభించారు. భారీ వర్షాల కారణంగా తాత్కాలికంగా విరామం ఇచ్చిన ఈ కార్యక్రమాన్ని ఇటీవల తిరిగి



ప్రారంభించారు. ప్రజల ఫిర్యాదులు తీసుకునేందుకు ప్రభుత్వం తరపున మంత్రులు, వారితోపాటు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీ ప్రధాన పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ప్రతి శనివారం ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి అర్జీలు తీసుకుంటున్నారు. ఇందులో ప్రభుత్వ కార్యాలయాల్లో అలసత్వం, అధికారులు, పోలీసుల వేధింపుల అంశాలతోపాటు న్యాయవ్యవస్థ వైఫల్యం వల్ల పెరుగుతున్న కొన్ని సమస్యలపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని సమస్యల్ని అక్కడికక్కడే సంబంధిత అధికారులు, పోలీసులతో మాట్లాడి చర్యలు తీసుకోవలసిందిగా సూచిస్తున్నారు. మిగతా ఫిర్యాదుల్ని సంబంధిత శాఖలు, మంత్రులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, స్థానిక ప్రజాప్రతినిధులకు రిఫర్ చేస్తున్నారు. వీటిపై టీడీపీ గ్రీవెన్స్ సెల్ స్టాంపు, తేదీ వేసి ఏ రోజు అర్జీల్ని ఆరోజు ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపుతున్నారు. సీఎంవో సిబ్బంది వాటిని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి ఫిర్యాదుకు గ్రీవెన్స్ నంబర్ కేటాయించి, ఫిర్యాదుదారు సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సమాచారం చేరవేస్తున్నారు. ఆ తర్వాత సీఎంవో సిబ్బంది ఫిర్యాదుల్ని విభజించి ఆయా శాఖలకు, అక్కడి నుంచి జిల్లా కలెక్టర్లకు పంపిస్తున్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి విచారిస్తున్నారు. నిరంతరం ప్రజల మధ్య కార్యక్రమాల పట్ల ప్రత్యేక ఆసక్తి కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజావేదికపై శ్రద్ధ కనబరచటం వల్ల ప్రస్తుతానికి ఫిర్యాదుల పరిష్కారం మెరుగ్గా కొనసాగుతోంది. ముఖ్యంగా సీఎం నేరుగా తీసుకునే ఫిర్యాదుల్ని వేగంగా పరిష్కరిస్తున్నారు. సెప్టెంబర్ చివరి నాటికి ప్రజావేదికకు 4,396 వినతులు రాగా, వాటిల్లో 3,327 పరిష్కరించారు. కానీ సమస్య మొదలైందో అక్కడికే, ఆ యంత్రాంగం వద్దకే వెళ్లి పరిష్కరించటానికి పెద్దఎత్తున వనరుల్ని, శక్తిసామర్థ్యాల్ని వినియోగించాల్సి వస్తోంది. పాలనలో ప్రజలకు భాగస్వామ్యం ఉండాలి, పార్టీ నేతలు ప్రజల మధ్య నిరంతరం ఉండాలి అనుకున్నా ఇది సరైన మార్గం కాదు. ఈ తీరుగా వెళ్లటం వల్ల ఫిర్యాదులు ఎప్పటికీ 'జీరో' స్థాయికి రావు. ఉన్నకొద్దీ ఫిర్యాదులు పెరుగుతూ పరిష్కారం మాత్రం ప్రయాసగా మారుతుంటుంది. ఇప్పటికే రెవెన్యూ విభాగంలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాల్లో పరిష్కారాలు తగ్గిపోయి ఉన్నకొద్దీ రాష్ట్రస్థాయికి ఫిర్యాదులు పెరిగిపోతున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం, రెవెన్యూ శాఖ మంత్రి, మరో మంత్రి లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కి ఈ అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది జూన్ 15 నుంచి సెప్టెంబర్ 19 వరకు రెవెన్యూ శాఖకు 35,928 ఫిర్యాదులు, వినతులు అందాయి. రెవెన్యూ మంత్రికి 2 వేల ఫిర్యాదులు అందగా, ఆయన కార్యాలయం నుంచి కలెక్టర్లకు 1,414 అర్జీలు వెళ్లాయి. కేవలం 16 దరఖాస్తులకు మాత్రమే తిరుగు సమాధానం వచ్చింది. కలెక్టర్ నుంచి వీఆర్వో వద్దకు వెళ్లి సమాధానం రావటంలో విపరీత జాప్యం జరుగుతోంది. కొన్ని ఫిర్యాదుల్ని పరిష్కరించామని చెబుతున్నా, దరఖాస్తుదారుల అభ్యంతరంతో తిరిగి తెరవాల్సి వస్తోంది. ఇలా ఇప్పటివరకు 1,856 ఫిర్యాదుల్ని తిరిగి పరిశీలించాల్సి వస్తోందని గణాంకాలు తెలియచేస్తున్నాయి. ముఖ్యమంత్రి, కీలకమైన మంత్రులు

ఇతర ప్రధానాంశాల మీద దృష్టి సారించాల్సి వస్తే, కార్యక్రమం పూర్తిగా మొక్కుబడిగా తయారవుతుంది.

అయితే ఎమ్మెల్యేలు ప్రభుత్వంలో భాగం కాకున్నా, స్థానిక ప్రభుత్వాలలో జోక్యం చేసుకుంటూ ప్రజల సమస్యలను పరిష్కరించే సంస్కృతి ఇప్పటికే మన వద్ద పాతుకుపోయింది కాబట్టి, ఫిర్యాదుల్ని శాసనసభ్యులు నియోజకవర్గ స్థాయిలో నేరుగా తీసుకున్నచోట కొంతమేర ఫలితం నిలకడగా కనిపిస్తుంది. అయితే అక్కడ కూడా చట్టప్రకారం కాకుండా చాలామేర లోపాయికారీగా, ఎంతోకొంత లంచాలు ముట్టచెప్పక తప్పని పరిస్థితిలో జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో అధికార యంత్రాంగం ఫిర్యాదులు తీసుకోవటం కూడా పరిమిత ఫలితాలనిస్తోంది. అందువల్ల ఫిర్యాదుల్ని పరిష్కరించి నాణ్యమైన పౌర సేవల్ని ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు, ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు వ్యవస్థీకృత మార్పులే పరిష్కారం.

పార్టీలు ఇప్పటికే ప్రజల్లో తగినంత విశ్వసనీయత లేక ఓట్ల కోసం తాత్కాలిక చర్యలు తాత్కాలిక పథకాలను హామీ ఇస్తున్నాయి. ఎన్నిక తర్వాత ఎన్నికకు చాలా రాష్ట్రాల్లో ఈ హామీల భారం పెరిగిపోతోంది. అప్పులు చేసి మరీ ఇస్తున్న హామీల వల్ల ఆర్థిక పరిస్థితి తల్లకిందులవటం ఒక సమస్య కాగా, నేరుగా నగదు బదిలీ అయ్యే పథకాలు మినహాయించి మిగతా అంశాల్లో ప్రభుత్వ సేవల నాణ్యత అధ్వాన్నంగా ఉంటోంది. సాంకేతికత అందుబాటులో ఉండటం వల్ల కొన్ని రంగాల్లో అవినీతి తగ్గినా, నాణ్యమైన సేవలు అందించటంలో ప్రభుత్వ వైఫల్యం ఇప్పటికీ గణనీయ స్థాయిలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించటంతోపాటు సంక్షేమాలు, అభివృద్ధి మధ్య సమతూకం సాధించేందుకు చర్యలు తీసుకుని, ప్రజల మెప్పు పొందటానికి మితిమీరిన తాత్కాలిక పథకాలు కాకుండా నాణ్యమైన పౌర సేవలను అందించేలా ప్రభుత్వ సామర్థ్యాన్ని మెరుగుపరచాలి.

ఇందులో కీలకమైనది అధికారాన్ని, వనరుల్ని వికేంద్రీకరించి, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం. గాంధీ పేరును తగిలించుకున్న అగ్రనాయకత్వం కనుసన్నల్లో నడుస్తూ గాంధీ పేరును పేటెంట్‌లా వినియోగించుకునే కాంగ్రెస్ పార్టీ, మంచి పాలన అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇందుకోసం చర్యలు తీసుకోవాలి. గాంధీ జయంతికి నిజమైన నివాళులర్పించాలి. పక్షపాతాలకతీతంగా అన్ని పార్టీలూ కలిసిరావాలి. ❖

# గ్రామ న్యాయాలయాల ఏర్పాటుపై రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం



దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ప్రజలకు సత్వరం న్యాయం అందించే గ్రామ న్యాయాలయాలను దేశవ్యాప్తంగా నెలకొల్పాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కోర్టులపై పెండింగ్ భారాన్ని తగ్గించేందుకూ ఇవి దోహదపడతాయని జస్టిస్ బి.ఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. సర్వోన్నత న్యాయస్థానం పర్యవేక్షణలో దేశవ్యాప్తంగా గ్రామన్యాయాలయాలను ఏర్పాటు చేసేలా కేంద్రం, రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఇటీవల విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ధర్మాసనంలో జస్టిస్ పి.కె మిశ్రా, జస్టిస్ కె.వి విశ్వనాథన్ సభ్యులుగా ఉన్నారు. 2009 నుంచి గ్రామ న్యాయాలయాల ఏర్పాటుపై హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి పదేపదే సూచిస్తున్నా పట్టించుకోవడం లేదని ఒక పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గ్రామన్యాయాలయాల తాజా పరిస్థితిని వివరిస్తూ ఇప్పటివరకూ అఫిడవిట్ దాఖలు చేయని హిమాచల్‌ప్రదేశ్ సహా మూడు రాష్ట్రాలకు ధర్మాసనం మూడు వారాల గడువు ఇచ్చింది. ఈ వ్యవహారంలో కోర్టుకు సహాయపడేందుకు సీనియర్ న్యాయవాదిని అమికస్ క్యూరీగా నియమించింది. కేంద్ర ప్రభుత్వం 2008లో తీసుకొచ్చిన చట్టం ఆధారంగా ఇప్పటివరకు 6 శాతం మాత్రమే గ్రామన్యాయాలయాలు ఏర్పాటయ్యాయి. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది. గ్రామ న్యాయాలయాల ఏర్పాటు, వాటి మౌలిక వసతులకు సంబంధించి అన్ని రాష్ట్రాలు అఫిడవిట్ దాఖలు చేయాలని జులై 12న విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశించింది.

# రుణాలకు స్వయంప్రతిపత్తి కోసం

# రాష్ట్రాల నుండి పెరుగుతున్న డిమాండ్




ఆర్థిక పురోగతి ఉన్న రాష్ట్రాలు రుణాలు తీసుకోవడానికి స్వయంప్రతిపత్తి కల్పించాలని బీజేపీయేతర రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కేరళ రాజధాని తిరువనంతపురంలో 5 రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సదస్సు జరిగింది.

యూనియన్ ప్రభుత్వం బదిలీ చేసే పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50% పెంచాలని , యూనియన్ విధిస్తున్న సెస్‌లు, సర్ ఛార్జీలు తగ్గించాలని, కేంద్ర ప్రాయోజిత పథకాలు తగ్గించి రాష్ట్రాల స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగానికి అనుమతించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య అధికార సమతుల్యత ఉండాలన్నారు.

**కేంద్రం ఆధిపత్య ధోరణి**

రాజ్యాంగ నిర్మాతల లక్ష్యానికి భిన్నంగా కేంద్రం ఆధిపత్యం కారణంగా రాష్ట్రాల అభివృద్ధికి తగినన్ని నిధులు రావటం లేదు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ 14వ ఆర్థిక సంఘం తీసుకున్న నిర్ణయం తప్పుదోవ పట్టించేదిగా ఉంది. అది నిబంధనలను సరళతరం చేసిందే తప్ప వనరులలో నిజమైన పెరుగుదల లేదు. సెస్‌లు, సర్‌ఛార్జీల ఆదాయాన్ని కేంద్రం రాష్ట్రాలతో పంచుకోవడం లేదు. వాటిపై కేంద్రం ఆధారపడడంవల్ల స్థూల పన్ను ఆదాయం 28 శాతానికి పెరిగింది. దీంతో రాష్ట్రాలకు గణనీయంగా గండిపడింది. జీఎస్టీ పరిహారంలో తీవ్ర జాప్యం మూలంగా రాష్ట్రాల ఆర్థిక స్థితి దెబ్బతింటోంది. రాష్ట్రాల సామర్థ్యానికి అనుగుణంగా బడ్జెట్‌లను రూపొందించుకోలేకపోతున్నాం. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తోంది.

**దక్షిణాది రాష్ట్రాల గణనీయ సహకారం**

దక్షిణాది రాష్ట్రాలు జనాభాలో 19.6 శాతం మాత్రమే ఉన్నప్పటికీ జీడీపీలో 30 శాతం సమకూరుస్తూ గణనీయమైన సహకారం అందిస్తున్నాయి. అయినా పన్నుల పంపిణీలో వారి వాటాను 21.073శాతం నుంచి 15.800 శాతానికి ఫైనాన్స్ కమిషన్ తగ్గించింది. కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని నిరోధించటంతోపాటు కఠినమైన నిబంధనలు, మ్యాచింగ్ గ్రాంట్‌లు షరతులు రాష్ట్ర బడ్జెట్లను ప్రభావితం చేస్తున్నాయి. యూనియన్ షరతుల మేరకు తమ సొంత వనరుల నుండి నిధులు కేటాయించాల్సి వస్తోంది. దీంతో రాష్ట్రాల్లోని ప్రాధాన్య రంగాల నుంచి నిధులు మళ్లుతున్నాయి. 2011 జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గుతుంది. దీనిని నివారించాలి. జనాభా నియంత్రణ, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిన రాష్ట్రాలు అన్యాయంగా జరిమానాకు గురయ్యే అవకాశం ఉంది. ఒక శతాబ్దంలో సభలో ప్రతినిధుల సంఖ్య గరిష్టంగా 435గా నిర్ణయించిన అమెరికా విధానాన్ని భారత్ అనుసరించాలి" అని భట్టి సూచించారు.

**సెస్‌ల పెరుగుదలపై ఆర్థిక సంఘం దృష్టి సారించాలి**

కేంద్రం విధిస్తున్న సెస్‌లు, సర్‌ఛార్జీలు పెరుగుతున్నాయని, దీంతో పన్నులలో రాష్ట్రాలవాటా తగ్గుతోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. దీనిపై 16వ ఆర్థిక సంఘం దృష్టి సారించాలని సదస్సు ప్రారంభోపన్యాసంలో ఆయన సూచించారు. సదస్సులో కర్ణాటక రెవెన్యూ మంత్రి కృష్ణ బైరె గౌడ, తమిళనాడు, పంజాబ్, కేరళ ఆర్థిక మంత్రులు, ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు. ❖

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th OCTOBER, 2024 Posting Date 15 &16th of every month




స్వేచ్ఛ, అభివృద్ధి కోసం పనిచేసే అంతర్జాతీయ సంస్థ మాంట్ పెరిలిన్ సొసైటీ న్యూఢిల్లీలో నిర్వహించిన వార్షిక సమావేశంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC “X” Roads, Hyderabad 500 020**